


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి గురువారం 21-04-2022 సంపుటి: 03 సంచిక: 217 పేజీలు: 4 వెల: రూ 3-00


## డబ్ల్యూహెచ్‌వో చీఫ్ కొత్త పేరు తులసీభాయ్.. పేరు పెట్టిన మోదీ



డబ్ల్యూహెచ్‌వో అధినేత టెడ్రోస్ హథనామ్‌కు ప్రధాని మోదీ కొత్త పేరు పెట్టారు. గుజరాత్‌లోని గాంధీ నగర్‌లో మూడు రోజుల పాటు గ్లోబల్ ఆయుశ్ ఇన్వెస్ట్ మెంట్ అండ్ ఇన్నోవేషన్ సమ్మిట్ జరుగుతోంది. ఈ కార్యక్రమానికి డబ్ల్యూహెచ్‌వో అధినేత టెడ్రోస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టెడ్రోస్ గుజరాతీలో మాట్లాడి అందర్నీ ఆశ్చర్యపరిచారు. అందరికీ నమస్కారం.. ఎలా వున్నారు? అంటూ గుజరాతీ భాషలో పలకరించారు. దీంతో సభికులందరూ చప్పట్లు కొట్టారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. టెడ్రోస్ తనకు మంచి మిత్రుడని పేర్కొన్నారు. తనకు ఇండియాకు చెందిన టీచరే చదువు బోధించారని తనతో చెప్పారని మోదీ పేర్కొన్నారు. తాను పక్కా గుజరాతీ అయిపోయానని, తనకు గుజరాతీ పేరును పెట్టాలని తనను కోరారని మోదీ వెల్లడించారు. దీంతో ఆయనకు తులసీ భాయ్ అని నామకరణం చేస్తున్నాని మోదీ సభలో పేర్కొన్నారు.ఆయుశ్ విభాగంలో పెట్టుబడుల సదస్సు జరగడం ఇదే ప్రథమమని మోదీ పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రజలు తమ ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవడానికి ఆయుశ్ మందులు కూడా పనిచేశాయని పేర్కొన్నా రు. ఈ అంతర్జాతీయ సదస్సుతో సంప్ర దాయ వైద్యానికి నూతన శకం ఆరంభం కానుందని ప్రకటించారు. రాబోయే 25 ఏళ్లలో ఈ విభాగం ప్రపం చ మానవాళికి మరింత చేరువయ్యే ఛాన్స్ ఉందని చెప్పుకొచ్చారు. ఔషధ మొక్కల పెంపకంలో వున్న రైతులు అత్యంత సులభంగా మార్కెట్‌తో కనెక్ట్ అవ్వడం ఎంతో ఆవశ్యకమని పేర్కొన్నారు. ఇక ప్రభుత్వం కూడా ఆయుశ్ విభాగాన్ని ఆధునీకరించడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఈ మార్కెట్ స్థలాలను కూడా వెదుకుతోందని ప్రధాని మోదీ వెల్లడించారు.

## చంద్రబాబును ఆ పార్టీ నేతలే వెన్నుపోటు పొడుస్తారు: జోగి రమేష్

విజయవాడ: బుద్దా వెంకన్న వ్యాఖ్యలపై గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కౌంటర్ ఇచ్చారు. చంద్రబాబు పుట్టిన రోజు పూట కేక్ కట్ చేసుకోకుండా బుద్ధి లేకుండా బుద్దా వెంకన్న మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. వంద మందితో సూసైడ్ స్క్వాడ్ తయారు చేసుకున్నానని ఎలా మాట్లాడతారని దుయ్యబట్టారు. ఎన్టీఆర్‌ని చంద్రబాబు వెన్నుపోటు పొడిచినట్లు.. చంద్రబాబుని కూడా ఆ పార్టీ నేతలే వెన్నుపోటు పొడుస్తారని అన్నారు. చంద్రబాబుని ప్రజలే



మరిచిపోయారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రతిపక్షనేతగా కూడా పనికిరాడని ప్రజలు భావిస్తున్నారని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలన అందిస్తున్నారని తెలిపారు. అమ్మ ఒడి, ఆసరా లాంటి అన్నిపథకాలు ప్రజలకి అందుతున్నాయని పేర్కొన్నారు.

## చంద్రబాబుకు సీఎం జగన్ జన్మదిన శుభాకాంక్షలు



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత, టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'జన్మదిన శుభాకాంక్షలు చంద్రబాబుగారు' అని ట్వీట్ చేశారు. కాగా చంద్రబాబు నాయుడు నేడు 73వ ఏట అడుగుపెడుతున్నారు.

## తూర్పు గోదావరి జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేపు (గురువారం) తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో బిర్లా గ్రూప్ కాస్టిక్ సోడా యూనిట్‌ను సీఎం జగన్ ప్రారంభించనున్నారు. సీఎం జగన్‌తో పాటు ఈ కార్యక్రమానికి ఆదిత్య బిర్లా



గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా హాజరుకానున్నారు.సీఎం వైఎస్ జగన్ గురువారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు బలభద్రపురం చేరుకుంటారు. అక్కడ గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కాస్టిక్ సోడా ప్లాంట్‌ను కుమార మంగళం బిర్లాతో కలిసి సందర్శించిన అనంతరం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత 12.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం తాడేపల్లి చేరుకుంటారు.

## అవినీతిపై ఫిర్యాదులకు ఏసీబీ యాప్: సీఎం జగన్



అమరావతి: రాష్ట్రంలో ఏసీబీ, దిశ, ఎస్‌ఈబీ కార్యకలాపాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అధికారులను ఆదేశించారు. దిశ తరహాలో అవినీతి ఫిర్యాదులకుగానూ ఏసీబీ యాప్ తేవాలని ఆయన అధికారులకు సూచించారు. తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో హోం శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ.. ఏసీబీకి యాప్ ద్వారా ఆడియో ఫిర్యాదు సైతం చేయొచ్చని పేర్కొన్నారు. అవినీతి చోటు చేసుకుంటున్న విభాగాలను క్లీన్ చేయాల్సిందేని ఆయన అధికారులను ఆదేశించారు. నెలరోజుల్లోగా ఏసీబీ యాప్ రూపకల్పన జరగనుందని, నేర నిర్ధారణకు ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేయాలన్నారు. అలాగే మండల స్థాయి వరకూ ఏసీబీ స్టేషన్లు ఉంటాయని చెప్పారు.ఇతర విభాగాల్లో అవినీతి ఫిర్యాదులపైనా ఏసీబీ పర్యవేక్షణ ఉంటుందని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యవహారాలకు రాష్ట్రంలో చోటు ఉండరాదని తెలిపారు. మూలాల్లోకి వెళ్లి కూకటివేళ్లతో పెకిలించేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం.. విద్యాసంస్థలపైనా ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. చీకటి ప్రపంచంలో వ్యవహారాలను నిర్మూలించాలని తెలిపారు. ప్రతినెలా ఈ అంశాల్లో ప్రగతిని నివేదించాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌ఈబీకి ప్రత్యేక కాల్ సెంటర్ నంబర్ ఉంటుందని సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో హోంశాఖ మంత్రి తానేటి వనిత, సీఎస్ సమీర్ శర్మ, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గూగుల్‌లో వెన్నుపోటు అని కొడితే చంద్రబాబు ఫొటో వస్తుంది: కొట్టు సత్యనారాయణ

పశ్చిమగోదావరి: ఇటీవల కాలంలో ప్రతిరోజూ ఎల్లో మీడియా వారి ఇష్టమొచ్చిన రీతిలో ప్రభుత్వం మీద బురద చల్లుతూ, ప్రతి పథకాన్ని ఎవరికి ఉపయోగపడటం లేదని మాట్లాడుతున్నారని డిప్యూటీ సీఎం, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. విచక్షణ కోల్పోయి దారుణంగా రాసే రాతలకు ప్రజలకు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా ఆనాడు అంత అవినీతి జరిగితే ఈ మీడియా ఎప్పుడైనా ప్రచురించిందా? అని సూటిగా ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ పని చేసిన ప్రజలకు అన్ని రకాలుగా లబ్ధిపొందే విధంగా ఆలోచించి చేస్తారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ ధైర్యానికి తట్టుకోలేక ఈ విధంగా భయపడి ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతుంటే, ఇది ఇలాగే ఉంటే టీడీపీ మనుగడ కష్టమని ఈ విధంగా విషం కక్కుతున్నారని దుయ్యబట్టారు.



మేనిఫెస్టోను ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్ లాగా భావించి అందులో ఉన్న ప్రతీ హామీని నెరవేరుస్తున్నారని తెలిపారు. ఏ రాష్ట్రం అప్పులు లేకుండా ప్రజాస్వామ్యాన్ని నడిపిస్తున్నారని అన్నారు. పోనీ అప్పు చేసి ఎవరైనా దోచేసుకుని తినేశారా? అది ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు పెడుతున్నారని తెలిపారు. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే ఇప్పుడున్న సంక్షేమ కార్యక్రమాలు అన్ని నిలిపివేస్తామని మీరు ప్రజలకు చెప్తున్నట్లు అనిపిస్తుందని అన్నారు. 25 లక్షల కుటుంబాలకు వైఎస్సార్ చేయూత ద్వారా లబ్ది చేకూరుతుందని గుర్తుచేశారు. నాడు-నేడు ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి మార్చింది కనపడటం లేదా? అని ప్రశ్నించారు. 31 లక్షల మంది సొంతఇళ్లు లేని కుటుంబాలకు ఒక మహా యజ్ఞం లాగా సొంతఇళ్లు అందచేస్తున్నామని పేర్కొన్నారు. దానికి కూడా కోర్టులో కేసులు వేసి, అడ్డగించే పనులు చేయడం లేదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు అభిప్రాయాలు అన్ని మాజీ ఐఏఎస్ అధికారులతో చెప్పించి, ఎల్లో మీడియాలో ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల విద్యుత్ సంక్షోభం వస్తుందని ప్రచారం చేయడం ఎంత దారుణమని మండిపడ్డారు.

## చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా దేవినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు

విజయవాడ: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఆ పార్టీ నేత దేవినేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. 72 కేజీల కేక్‌ను పిల్లలతో కలిసి కట్ చేశారు. 250 మంది పిల్లలకు పుస్తకాలతో పాటు స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. 72వ పుట్టిన రోజు జరుపుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రాబాబు.. చిన్నప్పుడు తొమ్మిదో తరగతి వరకు స్కూలుకి వెళ్లడానికి 11 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లేవారన్నారు. ఆ పట్టుదల, అంకితభావమే ఇప్పుడు ఆయన్ని ఈ స్థాయికి చేర్చిందన్నారు.రాజకీయంగా ఉన్నత శిఖరాలకు చేర్చడంతో పాటు... హెరిటేజ్ డెయిరీ వ్యవస్థాపకులుగా చంద్రబాబు పేరు చరిత్రలో నిలబెట్టిందని దేవినేని చందు అన్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొంటోందని, విద్యారంగం కూడా దానికి మినహాయింపేమీ కాదన్నారు. ఎయిడెడ్ స్కూళ్లకు అపారంగా ఉన్న ఆస్తులను ప్రభుత్వపరం చేసుకోవడానికి జగన్ సర్కారు చూసిందన్నారు. కోర్టు మొట్టికాయలు వేసేసరికి వెనక్కి తగ్గిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం లేకుండా చేయాలని ప్రయత్నిస్తోందని, మాతృభాష లేకుండా నిరుపేదలు విద్యని అభ్యసించడం సాధ్యమా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూలు స్టూడెంట్‌నని చెప్పుకునే జగన్‌కు సామాన్యుల పాట్లు ఏం తెలుస్తాయన్నారు.

## తెలంగాణలోని కొన్ని రైస్ మిల్లుల్లో అవకతవకలు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలోని కొన్ని రైస్ మిల్లుల్లో అవకతవకలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని రైస్ మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం లేదన్నారు. ఎఫ్‌సీఐ దాదుల్లో 4,53,890 సంచుల ధాన్యం తక్కువ ఉందని, అవి ఎక్కడికి పోయాయో టీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. తక్కువైన ధాన్యంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశామన్నారు. "అన్ని రైస్ మిల్లులలో తనిఖీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశాం. రైస్ మిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో త్వరలో లేఖ రాస్తాం. ధాన్యం కొనాలని సివిల్ సప్లై కార్యదర్శి కేంద్రానికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్రం ఆమోదించింది. రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనలేదు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.



## తెలంగాణకు లక్షా 40 వేల కేంద్ర ప్రభుత్వ ఇండ్లు మంజూరు

### కనీసం లబ్ధిదారుల జాబితాను ఇవ్వమంటే స్పందన లేదు
### పేదల జీవితాలతో ఆడుకుంటున్న కేసీఆర్
### బిజెపి రాష్ట్ర అద్యక్షుడు బండి సంజయ్ కుమార్

గద్వాల్ ఏప్రిల్ 20 కేంద్ర ప్రభుత్వం తెలంగాణ లక్షా 40 వేల ఇండ్లు మంజూరు చేస్తే కేసీఆర్ పేదలకు ఇల్లు కట్టించలేదని బిజెపి రాష్ట్ర అద్యక్షుడు బండి సంజయ్ కుమార్ ఆరోపించారు.? గద్వాల్ జిల్లా మల్దకలోని 'ప్రజా సంగ్రామ యాత్ర' శిబిరం వద్ద పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తో మాట్లాడారు. కనీసం లబ్ధిదారుల జాబితాను ఇవ్వమంటే స్పందించడం లేదు. పేదల కోసం కేంద్రమిచ్చే పైసలు తీస్కుంటున్నడు. పేదల జీవితాలతో ఆడుకుంటున్నడు. గ్రామ పంచాయతీలకు, మరుగుదొడ్ల నిర్మాణానికి, రహదారులకు, మహిళలకు రుణాలు కేంద్రమే ఇస్తోంది. కాని, కేసీఆర్కరెంట్ చార్జీలు పెంచిండు. పొలం కాడ ఫ్రీ అనుకుంటూ ఇంటికాడ బిల్లుల మోతతో నడ్డి విరుస్తున్నడు. ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు రూ. 10 లక్షల చొప్పున దళితబంధు ఇస్తనన్నడు.. 3 ఎకరాల భూమి ఇస్తనన్నడు.. ఇంచ్చిండా..? ప్రజలు నిలదీయాలి. ఈ ప్రాంతంలో కాలేజీలు, దవాఖానాలు ఎందుకు లేవో ముఖ్యమంత్రిని ప్రశ్నించాలి. రాష్ట్రంలో



బిజెపి అధికారంలోకి రాగానే పేదలకు ఉచిత విద్య- ఉచిత వైద్యం అందిస్తం. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా పేదలంతా బిజెపిని ఆదరిస్తున్నరు. వారి బాధలను చెప్పుకుంటున్నరు. ఎన్నికలేవు ఇప్పుడు.. ఎండకు వెరవక ప్రజల కష్టాలు తెలుసుకుంటూ పాదయాత్రగా వస్తున్నాం. కాని ప్రజల కోసం మేం కొట్లాడితే టీఆర్ఎస్ గూండాలు మాపై దాడులకు తెగబడుతున్నరు. మా ఫ్లెక్సీలు కాలుస్తున్నరు. టీఆర్ఎస్ మంత్రులంతా ఏసీ రూముల్లో పండుకుంటున్నరు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశాలతో మేం ప్రజల్లో తిరుగుతున్నం. సీఆర్ అంబేద్కర్ ను అవమానించిన దుర్మార్గుడు. రాజ్యాంగం పట్ల అనుచితంగా మాట్లాడిండు. అందుకే కేసీఆర్ కు తగిన బుద్ధిచెబుదాం.. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పర్చుకుందామన్నారు.

# సంపాదకీయం

గురువారం ,21-04-2022

## మూడో ప్రపంచ యుద్ధమేనా.....

మూడో ప్రపంచ యుద్ధం ఖాయమేనా ఇక ? రష్యా ఏదైతే వద్దని డిమాండ్ చేస్తోందో.. సరిగ్గా అదే ఉక్రెయిన్ చేస్తోంది. మరి పరువు కోసం పాకులాడే రష్యన్ ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్.. యుద్దాన్ని మరో లెవెల్‌కి తీసుకువెళ్ళడం కన్ఫర్మే కదా ? తాజా పరిణామాలు చూస్తుంటే అవుననే అంటున్నారు అంతర్జాతీయ అంశాల పరిశీలకులు. 55 రోజుల నుంచి అంటే ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ఉక్రెయిన్ దేశంలో రష్యా ప్రత్యేక సైనిక చర్య కొనసాగుతోంది. నాలుగైదు రోజుల్లో ఉక్రెయిన్‌ను దారిలోకి తెచ్చుకోగలమని భావించిన రష్యా అంచనాలు తప్పాయి. ఉక్రెయిన్‌కు అమెరికా తదితర నాటో దేశాలు ఆయుధాలను, ట్యాంకర్ ట్రాకర్లను, ఇతర మిలిటరీ టెక్నాలజీని సరఫరా చేయడం వల్ల ఉక్రెయిన్ మిలిటరీ రష్యన్ దళాలను సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా అమెరికా నుంచి వచ్చిన స్టింగర్, జావెలిన్ యాంటి ట్యాంకర్ మిస్సైళ్ళతో ఉక్రెయిన్ మిలిటరీ రష్యన్ దళాలు వెనక్కి మళ్ళేలా చేసింది. కీవ్ నగరం నుంచి రష్యన్ దళాలు వెనక్కి మళ్ళడానికి కారణం ఈ యాంటి ట్యాంకర్ మిస్సైళ్ళేనని యుద్దనిపుణులు చెబుతున్నారు. ఇంతకీ ఉక్రెయిన్, రష్యా యుద్ధం నెక్స్ట్ లెవెల్‌కు చేరుకునే పరిణామం ఏం జరిగింది ? నిజానికి మార్చి చివరి వారంలోనే యూరోపియన్ యూనియన్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఎప్పటి నుంచో ఉక్రెయిన్ కోరుతున్న ఈయూ సభ్యత్వాన్ని ఇచ్చేందుకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేయాలని నెల రోజుల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా ఉక్రెయిన్ తమ దరఖాస్తులో పేర్కొన్న ఈయూలో చేరేందుకు తమ దేశానికి ఉన్న అర్హతలపై క్లారిటీ ఇవ్వాల్సిందిగా ఏప్రిల్ మొదటి వారంలో కోరారు. ఈయూ అడిగిన క్లారిఫికేషన్లను ఉక్రెయిన్ అందజేసిన క్రమంలో యూరోపియన్ యూనియన్ ప్రతినిధి బృందం ఏప్రిల్ 18వ తేదీన కీవ్ నగరంలో ప్రత్యక్షమైంది. ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్ స్కీతో ఈయూ ప్రతినిధి బృందం భేటీ అయ్యింది. ఉక్రెయిన్ వివరణతో ఈయూ ప్రతినిధిబృందం పూర్తిగా సంతృప్తి చెందినట్లు సమాచారం. దాంతో మరో వారం, పదిరోజుల్లోనే ఈయూ ప్రత్యేకంగా భేటీ అయి.. ఉక్రెయిన్ సభ్యత్వాన్ని ప్రకటిస్తారని తెలుస్తోంది. ఒకవేళ ఇలా ఆగమేఘాల మీద ఉక్రెయిన్ సభ్యత్వాన్ని ప్రకటించే అవకాశం లేకపోతే జూన్ మొదటి వారంలో జరగబోయే ఈయూ కౌన్సిల్ భేటీలో ఉక్రెయిన్ మెంబర్‌షిప్ ఖరారైందని ప్రకటించే అవకాశాలున్నాయని మరికొందరు అంచనా వేస్తున్నారు. ముందుగా ప్రకటించి.. జూన్ కౌన్సిల్ భేటీకి ఉక్రెయిన్‌ని పిలుస్తారా ? లేక కౌన్సిల్ భేటీలోనే ప్రకటిస్తారా అన్నది తేలాల్సి వుంది.ఏదైతేనేం.. ఉక్రెయిన్ ఈయూ సభ్యత్వం ఆల్మోస్ట్ కన్ఫర్మ్ అయ్యింది. అసలు రష్యా సైనిక చర్య ప్రారంభమైందే ఉక్రెయిన్ ఈయూకి దగ్గర అవ్వొద్దని, నాటో కూటమిలో చేరొద్దని.. మరి ఇపుడు ఈయూ ప్రతినిధిబృందం ఉక్రెయిన్ ఎంట్రీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇక ఎంటరవడమే మిగిలింది. మరి రష్యా ఏం చేయబోతోందిపుడు ? ఈ ప్రశ్న పలు శాంతికాముక దేశాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈయూ ప్రతినిధిబృందం ఉక్రెయిన్‌లోకి ఎంటరవడమే తరువాయి రష్యా యుద్దాన్ని ముమ్మరం చేసింది. కీవ్ నగరం నుంచి దూరంగా జరగుతున్నామని పదిహేను రోజుల క్రితం వెల్లడించిన రష్యా.. ఆ తర్వాత కొన్నాళ్ళపాటు ఈస్ట్ ఉక్రెయిన్ ప్రాంతాలైన డాన్ బాస్, డోనెట్స్క్, లూహాన్స్క్, మరియుపోల్‌లపై దాడులు కొనసాగించింది. మరియుపోల్ నగరాన్ని అయితే శవాల దిబ్బగా చేసేసింది. ఈస్ట్ ఉక్రెయిన్ ఏరియాను క్రిమియాలాగా రష్యా ఆధీనంలోని స్వతంత్ర దేశాలు/ప్రాంతాలుగా ప్రకటించిన తర్వాత రష్యా తన మిలిటరీ యాక్షన్‌ను నిలిపేస్తుందని అంతా అనుకున్నారు. కానీ.. తాజాగా పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ఏప్రిల్ 18వ తేదీన ఈయూ ప్రతినిధిబృందం కీవ్ సిటీకి చేరుకున్న సమయానికి కాస్త అటూఇటూగా రష్యా అయిదు మిస్సైళ్ళను వెస్ట్ ఉక్రెయిన్ ప్రాంతంలో పోలండ్ సరిహద్దుకు చేరువలో వున్న ఎల్వీవ్ సిటీపై ప్రయోగించి, విధ్వంసాన్ని సృష్టించింది. ఇటు రాజధాని కీవ్‌పైనా మళ్ళీ మిస్సైల్ దాడులు మొదలుపెట్టింది. ఇదివరకే ధ్వంసం చేసేసిన ఖార్కీవ్ సిటీపైనా బాంబు దాడులు మొదలుపెట్టింది. 55 రోజులుగా పెద్ద స్థాయిలో విధ్వంసం ఈయూలో ఉక్రెయిన్ చేరడాన్ని రష్యా ఎలాగో జీర్ణించుకోలేదు. ఫలితంగా ఉక్రెయిన్‌పై దాడులను మరింత ముమ్మరం చేయడం, మరిన్ని ప్రాణాంతక ఆయుధాలను రష్యా వినియోగించే ప్రమాదం కనిపిస్తోంది. అసలే ఇగో లెవెల్స్ కాస్త ఎక్కువే వుండే పుతిన్.. అణ్వాయుధ ప్రయోగానికి వెనుకాడకపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బయో వెపన్స్, కెమికల్ వెపన్స్ కూడా వినియోగించే అవకాశాలను అంతర్జాతీయ అంశాల విశ్లేషకులు కొట్టిపారేయడం లేదు.ఈయూ ప్రాథమిక సూత్రం " వన్ ఫర్ ఆల్.. ఆల్ ఫర్ వన్" అనే విధానం. ఉక్రెయిన్ ఈయూలో చేరితే " వన్ ఫర్ ఆల్.. ఆల్ ఫర్ వన్" విధానం ప్రకారం ఆ దేశ రక్షణ కోసం యావత్ యూరోపియన్ యూనియన్ దేశాలు రంగంలోకి దిగాల్సి వస్తుంది. ఫలితంగా ఉక్రెయిన్, రష్యా యుద్దంలో మరిన్ని దేశాలు ఎంటరవుతాయి. దాంతో రష్యా ఇప్పటి వరకు పరిమితంగా వినియోగిస్తున్న ఆయుధాలను పెంచడం ఖాయం. బలమైన సైనిక సంపత్తి కలిగిన యూరోపియన్ దేశాలు గనక యుద్ధరంగంలోకి నేరుగా దిగితే.. వాటిని ఎదుర్కొనేందుకు రష్యా తన వద్ద వున్న అత్యంత ఆధునిక యుద్ద సామాగ్రిని బయటికి తీయడం ఖాయం. ఇదే జరిగితే మూడో ప్రపంచయుద్ధం మొదలవడం ఖాయం. అపుడు దేశాలన్నీ అయితే ఉక్రెయిన్ వైపు, లేదా రష్యా వైపు మొగ్గాల్సి వస్తుంది. అదే జరిగితే ప్రపంచ యుద్ధం తీవ్రమై, అది ప్రపంచ నాశనానికి దారితీస్తుందంటే అతిశయోక్తి కాదు. మిలిటరీ యాక్షన్‌ని తీవ్రతరం చేసిన రష్యన్ బలగాలకు కొన్ని ప్రాంతాల్లో ఉక్రెయిన్ దళాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతూనే వుంది. ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని నగరాలను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్న రష్యాకు ఉక్రెయిన్ మిలిటరీ నుంచి ఊహకందని స్థాయిలో ప్రతిఘటన కనిపిస్తోంది. దాంతో రష్యన్ సైన్యం తీవ్రంగా శ్రమిస్తోందని అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. మరియుపోల్ సిటీని స్వాధీనం చేసుకునేందుకు రెడీ అయిన రష్యన్ దళాలు.. తమ పనిని పూర్తి చేయలేకపోయాయి. దాంతో వెంటనే వెపన్స్ వదిలేసి, సరెండర్ కావాలంటూ ఉక్రెయిన్ మిలిటరీకి రష్యన్ రక్షణ శాఖ అల్టిమేటం జారీ చేసింది. రష్యాతో యుద్ధం సెకెండ్ లెవెల్‌కి చేరిందంటూ జెలెన్ స్కీ ప్రకటించిన కాసేపటికే రష్యా రక్షణ విభాగం ఈ అల్టిమేటం జారీ చేయడం విశేషం.

# సజ్జల దూరం... విజయసాయి దగ్గర...

విజయవాడ, ఏప్రిల్ 20,మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ అనంతరం పార్టీలో చెలరేగిన అసంతృప్తి సెగలు ఇంకా పూర్తిగా చల్లారనే లేదు...అప్పుడే మరో పదవుల పందేరానికి ఏపీ సీఎం జగన్ తెరలేపారు. ఈ సారి పెద్ద ఎత్తున నామినేటెడ్ పదవుల పందేరం చేయనున్నారు. మంత్రి పదవులు దక్కక అసంతృప్తితో ఉన్నవారిని నామినేటెడ్ పదవులతో సంతృప్తి పరచాలన్నది ఆయన ఉద్దేశం. అయితే ఆశావహుల సంఖ్య అసంఖ్యాకంగా ఉండటంతో నామినేటెడ్ పదవులు ఎవరికి ఇవ్వాలన్న కసరత్తు ఓ కొలిక్కి చేరలేదు. నేడో రేపో కసరత్తు పూర్తి చేసి తుది జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది. మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ విషయంలో జగన్ కు అంతా తానై సహకరించిన రాజకీయ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డిని మాత్రం ఈ సారి దరిదాపులకు రానీయకుండా జగన్ నామినేటెడ్ పోస్టుల జాబితా రూపొందించడం నుంచి ఎవరెవరికి పదవులు ఇవ్వాలన్న విషయంపై పూర్తిగా పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డిపైనే ఆధారపడుతున్నట్లు సమాచారం. ఇప్పటి వరకూ ఉత్తరాంధ్రకే పరిమితమైన ఆయనను ఇప్పుడు పార్టీ కేంద్ర కార్యాలయానికి తీసుకువచ్చి మరిన్ని బాధ్యతలు అప్పగించే యోచనలో జగన్ ఉన్నారు. మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ అనంతర పరిణామాలతో పార్టీ ప్రతిష్ట మసకబారిందని జగన్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన పునర్వ్యవస్థీకరణ అనంతర పరిణామాలను అంచనా వేయడంలోనూ, అసమ్మతి రాగాలను అదుపు చేయడంలోనూ సజ్జల విఫలం కావడం వల్లే స్వయంగా తానే రంగంలోనికి దిగాల్సిన పరిస్థితి వచ్చిందని జగన్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. అందుకే సజ్జలను పక్కన పెట్టి విజయసాయిరెడ్డిని మరింత క్రియాశీలంగా పార్టీ వ్యవహారాలలో నిమగ్నమయ్యేలా చేయాలన్నది జగన్ ఉద్దేశంగా కనిపిస్తున్నది. గతంలో జగన్ హస్తిన పర్యటన సందర్భంగా పీఎంతో అప్పాయింట్ మెంటు విషయంలో విజయసాయి రెడ్డి సఫలం కాలేకపోవడంతో ఆయన ప్రాధాన్యతను పార్టీలో తగ్గించినట్లు కథనాలు వచ్చాయి. వాటిలో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా గత కొంత కాలంగా పార్టీలో విజయ సాయి రెడ్డికి పెద్దగా ప్రాధాన్యత అన్నది కనిపించలేదు. రాజకీయ సలహాదారు హోదాలో సజ్జలే అన్నీ చక్కబెడుతూ వస్తున్నారు. మంత్రులను మించి ఆయన వివిధ శాఖలకు సంబంధించి సమీక్షలు నిర్వహించడం, విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించడం వంటివన్నీ సజ్జలే చూసుకుంటూ వచ్చారు. మంత్రులను డమ్మీలుగా మార్చి సజ్జలే అన్నీ తానై వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తిన ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోలేదు. సజ్జలను నియంత్రించడానికి ప్రయత్నించలేదు. అయితే మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ అనంతర పరిణామాలతో సజ్జల వన్ మేన్ షో వల్ల జరిగిన నష్టం ఏమిటన్నది తేటతెల్లమవ్వడంతో ఆయన ప్రాధాన్యత తగ్గించాలని జగన్ నిర్ణయించుకున్నట్లు విజయసాయి రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాయానికి రప్పించి కీలక బాధ్యతలు అప్పగించాలని జగన్ నిర్ణయించుకోవడాన్ని బట్టి అర్థమౌతున్నది. మొత్తం మీద సీఎం జగన్ పార్టీలో, ప్రభుత్వంలో సజ్జల ప్రాధాన్యతకు చెక్ పెట్టేందుకు సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో విజయసాయిరెడ్డి జగనే తాను తానే జగన్ అన్న చందంగా వైసీపీలో చక్రం తిప్పిన సంగతి తెలిసిందే. అయితే ఆ తరువాత క్రమంగా ఆయన పాత్రను నామమాత్రం చేసిన జగన్...విజయసాయి స్థానంలో రాజకీయ సలహాదారుల ఉన్న సజ్జలకు పార్టీ బాధ్యతలు అప్పగించారు. ఇప్పుడు ఆయనను కాదని విజయసాయికి ప్రాధాన్యత పెంచాలని నిర్ణయించుకున్నారు. నామినేటెడ్ పదవుల జాతరకు సజ్జలను దూరం పెట్టడంతోనే ఆయన ప్రభ ఇంక పార్టీలో మసకబారినట్లేనని పరిశీలకులు అంటున్నారు. ఇప్పుడు నామినేటెడ్ పదవుల పందేరం అనంతరం పార్టీలో మరోసారి అసంతృప్తి జ్వాలలు ఎగసిపడే అవకాశం ఉండొచ్చన్నది పరిశీలకుల అంచనా. గతంలోలా జగన్ మాటే శిరోధార్యం అన్న పరిస్థితి పార్టీలో కనిపించడం లేదనీ, పునర్వ్యవస్థీకరణ అనంతర పరిణామాలే అందుకు నిదర్శనమనీ చెబుతున్నారు. మరి పార్టీలో అసమ్మతిని, అసంతృప్తిని విజయసాయి రెడ్డి ఏ మేరకు నియంత్రించగలరన్నది రానున్న రోజుల్లో తేలుతుంది

# రాముతో సెల్ఫీ దిగిన పుష్ప

విశాఖపట్టణం, ఏప్రిల్ 20, అనకాపల్లిలో ఓ యువతి తనకు కాబోయే భర్త గొంతు కోసిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే. ఇష్టం లేని పెళ్లి చేసుకోలేక వరుడి గొంతు కోసినట్లు యువతి పోలీసులకు తెలిపింది. యువతిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఆమెను విశాఖపట్నం జైలుకు తరలించారు. అనకాపల్లి జిల్లాలోని మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చెందిన అద్దెపల్లి రామునాయుడు, రావికమతం గ్రామానికి చెందిన పుష్ప (22) కు వివాహం నిశ్చయమైంది. మే 20న వీరి వివాహం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో అత్తామామల ఆహ్వానం మేరకు రామునాయుడు సోమవారం రావికమతం వెళ్లాడు. ఈ సమయంలో స్నేహితులకు పరిచయం చేస్తానని రామునాయుడిని తీసుకెళ్లిన పుష్ప.. మార్గమధ్యంలోని ఓ ఫ్యాన్సీ దుకాణం వద్ద గిఫ్ట్.. అంటూ కత్తి కొనుగోలు చేసింది. ఆ తర్వాత వారిద్దరూ కోమళ్లపూడి శివారులోని అమరపురి ఆశ్రమం వద్దకు వెళ్లారు.ఈ సమయంలో 'సర్‌ప్రైజ్ గిఫ్ట్' ఇస్తానంటూ రాము కళ్లకు చున్నీతో గంతలు కట్టిన పుష్ప.. కత్తితో గొంతు కోసింది. రాము బలవంతంగా చున్నీ విప్పేసుకొని.. ఆమె ఏమైనా చేసుకుంటుందేమోనన్న ఆందోళనతో పుష్పను స్కూటీపై తీసుకొచ్చాడు. కాగా.. ప్రస్తుతం రామునాయుడికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. రాము పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా.. ప్రస్తుతం రామునాయుడు, పుష్పకు సంబంధించిన ఫొటో నెట్టింట వైరల్ అవుతోంది. రాముపై దాడి చేయడానికి ముందు పుష్ప అతనితో సెల్ఫీ ఫొటో దిగింది. ఆ తర్వాత అతనిపై దాడి చేసినట్లు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటం చర్చనీయాంశంగా మారింది.

# పాడేరులో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

**మోదకొండమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు**
**జిల్లా ఆసుపత్రిలో రోగులకు రొట్టె పాలు పండ్లు పంపిణీ**
**పాడేరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిఆధ్వర్యంలో...**
**అల్లూరిసీతారామరాజు**

తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు,ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.బుధవారం మండలంలో కుమ్మరిపుట్టు గ్రామంలో పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి నివాస గృహంలోపార్టీ నాయకులతో కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉన్న చంద్రబాబు 71 ఏళ్లు పూర్తి చేసుకుని 72వ ఏట అడుగు పెట్టారని ఆమె వెల్లడించారు.రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. విభజన గాయాలతో ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఏర్పాటైన రాష్ట్రాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ మళ్లీ గాడిలో పడాలంటే చంద్రబాబు అధ్యక్షతన తెలుగుదేశం ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని కుమ్మరిపుట్టు నుండి ద్విచక్ర వాహనాలపై వెళ్లి విశాఖ మన్యం ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జిల్లా ఆస్పత్రులు రోగులకు రొట్టె పాలు పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు,అరకు పార్లమెంట్ మహిళ కార్యదర్శి గబ్బడి శాంతి కుమారి, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గంగ పూజారి శివకుమార్ ,రోబ్బి రాము, డిప్పల కుమారి,అల్లంగి,బుబ్బలక్ష్మి,గుడెపు,ఉషారాణి పాడేరు మండల ప్రెసిడెంట్ రాము నాయుడు,జి మాడుగుల మండల ప్రెసిడెంట్ వంతల కొండలరావు,జ్యోతి కిరణ్,కీముడు,కల్యాణం,తాజ్ ద్దీన్,వెంకట్, పాటి బింబాబు, రమేష్ నాయుడు, శ్రీను, కొంతేలి, వెంకట ప్రసాద్,గబ్బడి, సింహాచలం, శోభన్ కుమార్, విశ్వనాథం, సుమన్, కె. కల్యాణం,బి. వరలక్ష్మి, సింహాచలం,నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గొలగమూడిలో ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

**-విశాలాక్షి వృద్ధుల ఆశ్రమంలో కేక్ కటింగ్-**
**అల్పాహార విందు**
**వెంకయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

నెల్లూరు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు నెల్లూరు జిల్లా ,వెంకటాచలం మండల పరిధిలోని గొలగమూడి గ్రామంలో విశాలాక్షి వృద్ధుల ఆశ్రమంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమం వెంకటాచలం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుమ్మడి రాజా యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత గొలగమూడి గ్రామంలోని విశాలాక్షి వృద్ధుల ఆశ్రమంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విశాలాక్షి వృద్ధుల ఆశ్రమములో ఆశ్రయం పొందుతున్న 108 మంది వృద్ధులకు ఇడ్లీ , వడ, పూరి, పొంగలిలతోపాటు బిస్కెట్ ప్యాకెట్ లను అల్పాహార విందుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలోని మండల అధ్యక్షులు కార్యకర్తలు టిడిపి అభిమానులు పాల్గొని శ్రీ శ్రీ గొలగమూడి వెంకయ్య స్వామి ఆలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావాలని, అప్పటివరకూ చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ,నూతన ఉత్తేజంతో ప్రజల మధ్యకు రావాలని శ్రీ శ్రీ గొలగమూడి వెంకయ్య స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాచలం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుమ్మడి రాజు యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల రీత్యా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గడిచిన 3 సంవత్సరాల కాలంలో వైకాపా పరిపాలనతో రాష్ట్ర ప్రజలు విసిగి ,వేసారి పోయారన్నారు. తెలుగుదేశం పార్టీ పరిపాలనలో చూస్తేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ప్రజలకు స్పష్టంగా అర్థమవుతుందని, ఈ రీతిన జగన్ పరిపాలన సాగుతుందని వ్యాఖ్యానించారు. పరిపాలన లో మార్పు కోరుతున్న ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,అభిమానులు బాధ్యతాయుత కర్తవ్యాన్ని నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్ళు అష్టైశ్వర్యాలతో ఆరోగ్యంగా జీవించాలని, తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఈ దిశగా చంద్రబాబు నాయుడుకి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని వెంకయ్య స్వామికి నివేదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూమి సురేంద్ర, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మామిళ్ళపల్లి శ్రీనివాసులునాయుడు, తిరుపతి పార్లమెంట్ రైతు సంఘం నాయకులు రావూరు రాధాకృష్ణారెడ్డి, పొదలకూరు మండలం అధ్యక్షులు తలచిరు మస్తాన్ నాయుడు, తోటపల్లి గూడూరు మండల అధ్యక్షులు సురేష్ రెడ్డి, మనుబోలు మండల అధ్యక్షులు గాలి రామకృష్ణ రెడ్డి మరియు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలో ఆగని మంత్రి వర్గ చర్చ-రచ్చ



విశాఖపట్టణం, ఏప్రిల్ 20,మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వైసీపీలో రేపిన చిచ్చు ఇంకా చల్లారలేదు. ఒక జిల్లాలో అసమ్మతి జ్వాల ఒకింత తగ్గిందనుకుని జగన్ ఊపిరి పీల్చుకునే లోగానే మరో జిల్లాలో మరింత ప్రజ్వలంగా అసమ్మతి మంటలు ఎగసి పడుతున్నాయి. తాజాగా పాయకరావు పేట ఎమ్మెల్యే తాను సింహాన్నిఅంటూ అసమ్మతి గర్జన చేశారు. నేరుగా పార్టీ అధినేత జగన్ కే వార్నింగ్ ఇచ్చేశారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా మంత్రి పదవి ఆశించినపాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు....ఉన్నట్టుండి పునవ్యవస్థీకరణ జరిగిన రెండు వారాల తరువాత అధిష్ఠానంపై అసమ్మతి బాంబు వేశారు. తనకు మంత్రి పదవి దక్కకపోవడం అన్యాయమంటూ ఆక్రోశం వ్యక్తం చేసి ఊరుకోకుండా....నేరుగా జగన్ సలహాదారు సజ్జలపైనా...పరోక్షంగా జగన్ పైనా విమర్శనాస్త్రాలు సంధించారు. తనకు మంత్రి పదవి దక్కకుండా చేసిన వాళ్లను విడిచపెట్టననీ....మూమూలుగా తాను శాంతంగానే ఉంటా అయితే అది నాణేనికి రెండో వైపే అంటూ పార్టీకి హైకమాండ్ కు అంటే జగన్ కు ఘాటు వార్నింగ్ ఇచ్చారు. సమయం చూసి తాను కొట్టే దెబ్బకు మైండ్ బ్లాక్ అయిపోవడం ఖాయమని హెచ్చరించారు.ఇప్పటి వరకూ మంత్రి పదవి దక్కని పలువురు వివిధ మార్గాలలో అసమ్మతి వ్యక్తం చేశారు. అయితే గొల్ల బాబూరావులా ఎవరూ నేరుగా జగన్ పై విమర్శల దాడి చేయలేదు. అసమ్మతిని సమర్ధంగా చల్లార్చామని జగన్, ఆయన అనుయాయులు భుజాలు చరుచుకుంటున్న సమయంలోనే ఉరుములేని పిడుగులా గొల్ల బాబూరావు ఘాటు విమర్శలతో, తీవ్ర హెచ్చరికలతో విరుచుకుపడటం వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ఆయనీ వ్యాఖ్యలు చేసింది జగన్ మైండ్ చైల్డ్ గా చెప్పుకునే వలంటీర్ వ్యవస్థకుసంబంధించిన కార్యక్రమంలో. ఆదర్శ వలంటీర్ సేవలకు పురస్కారా ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గొల్ల బాబూరావు....అదే వేదికపై నుంచి పార్టీ హైకమాండ్ పై, జగన్ పై విమర్శలు గుప్పించి, సవాళ్లు సంధించారు. వ్యాఖ్యలు చేశారు.కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా తమకు అన్యాయం జరిగిందంటూ అసంతృప్తితో రగిలిపోతున్నా బయటపడటానికి జంకుతున్న పలువురు ఎమ్మెల్యేలకు గొల్ల బాబూరావు మార్గదర్శనం చేశారా అన్నచర్చ వైకాపాలో అంతర్గతంగా సాగుతోంది. గొల్ల బాబూరావు పిల్లి మెడలో గంట కట్టేశారనీ, ఇక ఎలుకల్లా భయపడాల్సిన పరిస్థితి ఎమ్మెల్యేలకు ఉండదనీ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## మరో రెండు మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు

విజయవాడ, ఏప్రిల్ 20,రాష్ట్రంలో సరుకు రవాణాను చౌకగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఇప్పటికే రెండు మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు (ఎంఎంఎల్‌పీ)ల నిర్మాణం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా మరో రెండు పార్కుల నిర్మాణంపై దృష్టిసారించింది. తొలుత విశాఖపట్నం, అనంతపురం వద్ద రెండు భారీ ఎంఎంఎల్‌పీలను నిర్మించే విధంగా కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖతో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పుడు తాజాగా.. విశాఖ?చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో వైఎస్సార్ జిల్లా కొప్పర్తి వద్ద అభివృద్ధి చేస్తున్న వైఎస్సార్ జగనన్న ఎంఐహెచ్, హైదరాబాద్?బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌లో కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద అభివృద్ధి చేస్తున్న భారీ పారిశ్రామిక పార్కుల వద్ద రెండు భారీ ఎంఎంఎల్‌పీలను నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం గతిశక్తి నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా.. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద వీటి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఒక వస్తువు ధరలో 13 శాతంగా ఉన్న సరుకు రవాణా వ్యయం ఎంఎంఎల్‌పీలతో దానిని 8 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఇక రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న నాలుగు పోర్టులు.. రామాయపట్నం, మచిలీపట్నం.. కాకినాడ గేట్‌వే, భావనపాడులతో పాటు విజయవాడ?ఖరగ్‌పూర్ మధ్య సరుకు రవాణా కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కారిడార్ నిర్మిస్తుండటంతో వీటికి అనుగుణంగా రాష్ట్రంలో మొత్తం నాలుగు ఎంఎంఎల్‌పీలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇవన్నీ అందుబాటులోకి వస్తే ప్రస్తుతం సుమారు 150 మిలియన్ టన్నులుగా ఉన్న రాష్ట్ర సరుకు రవాణా 2024?25 నాటికి 300?350 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు.ఇదే సమయంలో ఓర్వకల్లు పారిశ్రామికవాడను రైల్వేలైన్‌తో అనుసంధానం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రతిపాదనలు పంపింది. ఓర్వకల్లు నుంచి పోర్టులు, ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారులకు తోడు రైల్వే కనెక్టివిటీ కూడా ఉండేలా కర్నూలు రైల్వేస్టేషన్ నుంచి బనగానపల్లికి ఓర్వకల్లు మీదుగా రైలు మార్గాన్ని అనుసంధానం చేయడంతో పాటు దూపాడు రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ యార్డ్‌నూ నిర్మించాల్సిందిగా ప్రతిపాదన

## జగన్ పర్యటనలో కనిపించని ఎమ్మెల్యేలు

విశాఖపట్టణం, ఏప్రిల్ 20,మంత్రివర్గ విస్తరణ తర్వాత తొలిసారిగా విశాఖ వచ్చిన సీఎం జగన్ పర్యటనలో అనేక ఆసక్తికర అంశాలు చోటు చేసుకున్నాయి. ఓ ప్రైవేట్ రిసార్ట్ లో ప్రకృతి చికిత్స పొందుతున్న హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌నిమర్యాదపూర్వకంగా కలిసేందుకే వచ్చిన సీఎం 2 గంటల పాటు విశాఖలో ఉన్నారు. ఈ క్రమంలో అసంతృప్త ఎమ్మెల్యేలను సంతృప్తి పరిచే కార్యక్రమం నుంచి విశాఖలో పార్టీ బలోపేతం వరకు పలు అంశాలపై దృష్టి పెట్టారు. ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నేతలకు పలు సూచనలు చేశారు ముఖ్యమంత్రి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో తమను పరిశీలించ లేదంటూ పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు అసంతృప్తిగా ఉన్నారు. తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై చోడవరం ఎమ్మెల్యే ధర్మశ్రీ కన్నీరు మున్నీరయ్యారు. మరోవైపు మంత్రి పదవి రెన్యువల్ అవుతుందని ఆశించి భంగపడ్డ తాజా మాజీమంత్రి అవంతి శ్రీనివాస్ లాంటి పరిణామాల మధ్య జిల్లాలో పర్యటించారు.సీఎంని కలిసేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పోటీపడ్డారు. కానీ తీవ్ర అసంతృప్తితో ఉన్న బాబురావు.. సీఎం పర్యటనలో ఎక్కడా కనపడలేదు. అలాగే మంత్రి పదవి ఆశించి నిరాశ చెందిన పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి కూడా హాజరుకాలేదు. కానీ ముందే నిర్ణయించుకున్న కార్యక్రమం వల్ల రాలేకపోయానని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులకు ఆమె సమాచారం ఇచ్చారు

# నెల్లూరు రచ్చకు ఫుల్ స్టాప్ ఎప్పుడు

నెల్లూరు, ఏప్రిల్ 20, ఏపీ సీఎం ఏ ముహూర్తంలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చేపట్టారో గానీ.. ఆ రోజు నుంచీ నెల్లూరు జిల్లాలో వైసీపీలో రచ్చ మొదలైంది. జిల్లాలోని వైసీపీ నేతలు ఒకే రోజు ఒకే సమయంలో విడివిడిగా సమావేశాలు నిర్వహించే దాకా విభేదాలు బహిర్గతం అయ్యాయి. ఇటీవలి కేబినెట్ లో కొనసాగింపు లేకుండా మాజీగా మారిన అనిల్ కుమార్ యాదవ్ వర్సెస్ మంత్రి అయిన కాకాని గోవర్ధన్ రెడ్డి- ఆనం రామనారాయణరెడ్డిగా ఈ విభేదాలు తారాస్థాయికి చేరాయంటున్నారు. ఈ విభేదాలు ఎక్కడి దాకా వెళ్లాయంటే.. నగరంలో వేస్తున్న వైసీపీ నేతల ఫ్లెక్సీలను చింపి పారేసే దాకా సమస్య వెళ్లింది. దీంతో నెల్లూరు నగరంలో గత కొద్ది రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.కొద్ది రోజుల క్రితం మంత్రి పదవి చేపట్టిన తర్వాత కాకాని గోవర్ధన్ రెడ్డి తొలిసారిగా నెల్లూరు జిల్లాకు వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగతం ఫ్లెక్సీలను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చింపి పారేశారు. మంత్రి కాకాని, మాజీ మంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఫోటోలతో ఉన్న ఫ్లెక్సీలు నెల్లూరు నగరం అంతా ఏర్పాటు చేశారు. అయితే.. వాటిని తొలగించడం వెనుక తాజా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ ప్రోద్భలం ఉందంటూ ఆనం, కాకాని వర్గీయులు బహిరంగంగానే ఆరోపించారు. అనిల్ పై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు.ఇలా ఉండగా.. తాజాగా వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బర్త్ సందర్భంగా నెల్లూరు నగరంలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను రాత్రికి ఎవరో చింపేశారు. మంగళవారం నాడు ప్రభాకర్ రెడ్డి బర్డే. అయితే.. గుర్తు తెలియని వ్యక్తులు వాటిని చింపేసినట్లు చెబుతున్నా.. ఈ చర్య వెనుక కూడా అనిల్ కుమార్ హస్తం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీలను మంగళవారం మళ్లీ ఏర్పాటు చేశారు.ఒకటే పార్టీలో ఉంటున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేల ఫ్లెక్సీలను చింపేస్తుండడం గర్హనీయమని వైసీపీ శ్రేణులు విమర్శిస్తున్నారు. నెల్లూరు నాయకుడి ప్రోద్భలంతోనే కొందరు పోకిరీలు ఇలా ఫ్లెక్సీలను చింపేస్తున్నారని భయపడుతున్నారు. కొందరు పోకిరీల కారణంగా నెల్లూరు నగరంలో ముందు ముందు దారుణమైన పరిస్థితితులు చూడాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటితో ఈ దుశ్చర్యలను ఆపకపోతే ఇలాంటి దురాగతాలు జిల్లా మొత్తం చుట్టుకునే ప్రమాదం ఉందని వారు ఆవేదన చెందుతున్నారు.

కుక్కలు చింపిన విస్తరిలా పార్టీ

నెల్లూరు జిల్లాలో వైసీపీ నేతల మధ్య గ్రూప్ వార్ రోజు రోజుకూ మరింతగా ముదిరిపోతోంది. నెల్లూరు జిల్లాలోని వైసీపీ ప్రజాప్రతినిధుల్లో ముందు నుంచే ఉన్న వర్గ విభేదాలు కేబినెట్ పునర్వ్యవస్థీకరణ తర్వాత మరింతగా బరి తెగించి మరీ బయటకు వస్తున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ గ్రూప్ వార్ ప్రధానంగా తాజా మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి- తాజా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ మధ్య జరుగుతోందని అంటున్నారు. వీరిద్దరితో పాటుగా మిగతా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఇప్పుడు రెండు గ్రూపులుగా మారిపోయి కయ్యానికి సై అంటే సై అంటున్నారు.నెల్లూరు వైసీపీ నేతల గ్రూర్ వార్ ఎంతవరకు వచ్చిందంటే ఒకరి కోసం వేసిన ఫ్లెక్సీలను మరొకరు రాత్రికి రాత్రే చింపేసి, పీకేసి, ధ్వంసం చేసే వరకూ వెళ్లడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తాజాగా పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. నెల్లూరు జిల్లా నేతల్ని అదుపులో ఉండాలని వైసీపీ అధినేత వార్నింగ్ లు ఇచ్చినా.. తగ్గేదేలే అనే రీతిలో వారు రోజు రోజుకూ రెచ్చిపోతున్నారు. మొన్న తాజా మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఫ్లెక్సీని తీసిపడేశారు. తాజాగా వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కూడా చింపేయడం నెల్లూరు నగరంలో ఉద్రిక్త పరిస్థితులకు కారణమైంది.అయితే.. ఈ ఫ్లెక్సీల ధ్వంసం వెనుక తాజా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ హస్తం ఉందని కొందరు ఆరోపిస్తుండడం గమనార్మం. తనకు మంత్రి పదవి కొనసాగించకపోవడమే కాకుండా తనకు వ్యతిరేకంగా ఉన్న కాకాని గోవర్ధన్ రెడ్డికి ఛాన్స్ ఇవ్వడం అనిల్ ఏ మాత్రం సహించలేకపోతున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలోనే కాకాని నెల్లూరుకు మరునాడు వస్తున్నారనగానే అనిల్ కుమార్ మీడియా సమావేశంలో.. తనకు గతంలో కాకాని ఎంతటి గౌరవం ఇచ్చారో.. ఎంత ప్రాధాన్యం ఇచ్చారో.. అంతక డబల్ ఇస్తానంటూ వెటకారం చేయడాన్ని పలువురు ఔరా.. అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. అనిల్ వ్యవహార సరళిని వైసీపీలోనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందని చెబుతున్నారు.ఇక.. కాకాని మంత్రి అయ్యాక తొలిసారి నెల్లూరు వచ్చిన సందర్భంగా నిర్వహించిన అభినందన సభ వేదికగా వెంకటగిరి వైసీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆనం రామనారాయనరెడ్డి అనిల్ పై పేరు చెప్పకుండా రెచ్చిపోయారు. గడిచిన మూడేళ్లుగా నెల్లూరు జిల్లాలో అభివృద్ధి అనే మాటే లేదన్నారు. జిల్లాకు రావాల్సిన అనేక ప్రయోజనాలు, నిధులు రాలేదని దుయ్యబట్టారు. అనిల్ కుమార్ జిల్లా మంత్రిగా ఉన్నంతకాలం రైతులు, సాధారణ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, మంచి మంత్రి కోసం ఈ మూడేళ్లుగా వేయి కళ్లతో ఎదురు చూసిన వారి ఆశలు కాకాని మంత్రి కావడంతో ఫలించాయని అనడం విశేషం. అనిల్ కుమార్ పై ఆగ్రహాన్ని అగణదొక్కుకుంటూనే ఆనం రామనారాయణరెడ్డి పేరు చెప్పకుండా విమర్శలు గుప్పించడంతో గ్రూపు రాజకీయాలు ఎంతదాకా వెళ్లాయో అర్థం అవుతోందంటున్నారు.నిజానికి కాకాని అభినందన సభకు గానీ, మంత్రి అయ్యాక తొలిసారి నెల్లూరు వస్తున్నందున ఆయనకు స్వాగతం పలికేందుకు కానీ అనిల్ కుమార్, మంత్రి పదవి ఆశించి భంగపాటుకు గురైన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి రాకపోగా.. కాకాని అభినందన సభ జరిగే రోజునే.. అదే సమంయలో కార్యకర్తల అభినందన సభ పేరుతో పోటీ సభనిర్వహించడంతో వారి మధ్య గ్రూపు తగాదాలు ఎంత ముదిరిపోయాయో అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మంత్రి కాకాని అభినందన సభకు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.ఇక నెల్లూరులో రాజకీయంగా కాక రేపుతున్న ఫ్లెక్సీల రగడపై అనిల్ కుమార్ స్పందించారు. ఫ్లెక్సీల ధ్వంసం వెనుక అనిల్ హస్తం ఉందంటూ వస్తున్న ఆరోపణలు, విమర్శలకు బదులివ్వడం గమనార్హం. నెల్లూరులో ఫ్లెక్సీలు వేయకూడదనే నిబంధన ఎప్పటి నుంచో ఉందని, తన ఫ్లెక్సీలను కూడా గతంలో వేయనివ్వలేదని గుర్తుచేశారు. ఆ క్రమంలోనే ఇంతకు ముందు దివంగత ఆనం వివేకానందరెడ్డి జయింతి సందర్భంగా వేసిన ఫ్లెక్సీలు కూడా తొలగించిన వైనాన్ని ప్రస్తావించడం గమనార్హం. ఈ క్రమలోనే కాకాని గోవర్ధన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఫ్లెక్సీలు కూడా తొలగించడంలో ఆశ్చర్యం ఏముందని ముక్తాయింపు ఇవ్వడం విశేషం.ఈ గొడవలు ఇలా ఉండగా తాజాగా మంత్రి కాకాని సొంత నియోజకవర్గం సర్వేపల్లిలో అనిల్ కుమార్ పర్యటించడం కూడా వివాదాస్పదం అయింది. 'నా నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలకు మిగిలిన ఎమ్మెల్యేలు రావచ్చు.. నేను సర్వేపల్లి వెళ్లకూడదా?' అని అనిల్ ప్రశ్నించారు. అంటే అనిల్ కావాలనే రెచ్చగొట్టేందుకే సర్వేపల్లి నియోజకవర్గంలో టూర్ చేశారనే విమర్శలు వస్తున్నాయి. మరో పక్కన మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి కూడా జిల్లా వైసీపీ నేతలు, ప్రజా ప్రతినిధుల మధ్య భేదాభిప్రాయాలపై మాట్లాడారు.

## కర్నూలు జిల్లా లో ఘోర రోడ్డు ప్రమాదం...ముగ్గురు మృతి

కర్నూలు కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆలూరు తాలూకా హాలహర్వి మండలం చింతకుంట దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బళ్లారి నుండి ఆదోని కి నిర్మిస్తున్న జాతీయ రహదారి విస్తరణ లో భాగంగా కడుతున్న వంతెన గుంత లో ద్విచక్రవాహనంపై వేగంగా వస్తూ అదుపుతప్పి పడిపోయారు. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనంలో ముగ్గురు ఉండడం అతి వేగంతో ప్రయాణం చేస్తూ ఉండడం నిర్మాణంలో ఉన్న వంతెన గుంత ని సకాలంలో గుర్తించక పోవడంతో ఈ పెను ప్రమాదం సంభవించిందని స్థానికులు చెప్పారు. మృతులంతా కూడా కర్ణాటక రాష్ట్రంలోని సిరుగుప్ప తాలూకా టెక్కలి కోట చెందిన బోయ గాది, కాడ సిద్ధ, బోయ చంద్రశేఖర్ లుగా హాలహర్వి మండలం పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 20 మంది నేరచరితులు బైబై..?

తిరుమల, ఏప్రిల్ 20, కలియుగ వైకుంఠం తిరుమలకు రోజూ వేలాదిమంది భక్తులు వస్తుంటారు. టీటీడీ పాలకమండలి అంటే ఎంతో ఉన్నతమయింది. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలిలో నేరచరితులు అంశం హాట్ టాపిక్ అవుతోంది. దీనిపై కోర్టులో పిటిషన్లు వేశారు. ప్రత్యేక ఆహ్వానితుల జాబితాపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డితో పాటు తనను పాలకమండలి సమావేశానికి హాజరయ్యేలా ఆదేశాలివ్వాలని పిటిషన్ వేశారు ఎస్. సుధాకర్అయితే, వెంటనే ఆదేశాలిచ్చేందుకు నిరాకరించింది హైకోర్టు. మరికొన్ని పిటిషన్లలో కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి, టీటీడీకి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. పిటిషనర్ల తరపున న్యాయవాదులు ఆశ్వినీకుమార్, యలమంజుల బాలాజీ వాదించారు. ప్రత్యేక ఆహ్వానితుల జాబితాపై ఉమ మహేశ్వర నాయుడు పాలకవర్గంలో నేరచరితుల పై బీజేపి నేత భాను ప్రకాష్ రెడ్డి పిటిషన్లు వేసిన సంగతి తెలిసిందే. తుది వాదనలు వినేందుకు జూన్ 20వ తేదీన కేసు విచారణ వాయిదా పడింది. పాలకమండలి సభ్యులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారని, తిరుమల పవిత్రతకు భంగం కలుగుతోందని విపక్షాలు, హిందూ ధార్మిక సంస్థలు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే.

## కరోనా వల్ల ఆర్టీసీకి రూ.5,680 కోట్ల నష్టం

**డీజిల్ ధర పెరుగుదలతో మరింత భారం**

**ఇబ్బందులున్నా ప్రజా ప్రయోజనాలనుకాపాడుతున్నాం**

**ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి**

రాజమహేంద్రవరం కరోనా వేవ్ ల వల్ల ఆర్టీసీ రూ.5,680 కోట్ల మేర నష్టపోయిందని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి చెప్పారు. డీజిల్ ధరల పెరుగుదలతో మరింత భారం పడిందని తెలిపారు. అయినా కూడా ప్రజల ప్రయోజనాలను కాపాడుతూ ఆర్టీసీని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్సు ఆయన తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్కే దక్కుతుందన్నారు. కరోనా వల్ల ఆర్టీసీకి రూ.5,680 కోట్ల నష్టం వాటిల్లిందని.. డీజిల్ ధరలు అమాంతం పెరగడంతో రోజుకు రూ.320 కోట్ల మేర నష్టపోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టీసీని అప్పుల బారి నుంచి బయటకు తెచ్చేందుకు ప్రయత్నిస్తే.. ప్రతిపక్షాలు తమ ఉనికి కోసం రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్య లను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మల్లికార్జునరెడ్డి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో ఈడీ చింతా రవికుమార్, కోనసీమ డీపీటీవో ఆర్వీఎస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలులో రోడ్డు ప్రమాదం

కడప కడప జిల్లా బద్వేలులో రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో డివైడరును ఓ ప్రైవేటు బస్సు ఢీ కొట్టింది. అదృష్టవశాత్తు ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఘటనలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. వెంగమాంబ ట్రావెల్స్ బస్సు బెంగుళూరు నుండి కనిగిరికి తిరుగుప్రయాణంలో ప్రమాదం జరిగింది. బస్సులో 50 మంది ప్రయాణికులు వున్నట్లు సమాచారం.

## వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం, 15 లీటర్ల సారా స్వాధీనం

కాకినాడ కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న సారా బట్టి పై జగ్గంపేట ఎస్ ఐ రఘునాథరావు తమ సిబ్బందితో దాడి చేశారు. మల్లిసాల గ్రామ అటవీ పరివాహక ప్రాంతంలో రహస్యంగా బెల్లపు నిల్వ ఉంచి, అక్రమ నాటుసారాను తయారు చేస్తున్నట్లు ఎస్ఐ రఘునాథరావు కు వచ్చిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున ఎస్ఐ రఘునాథరావు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టి పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీ కి సిద్ధంగా నిల్వ ఉంచిన సుమారు వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేయడంతో పాటు, సారా తయారీ కి ఉపయోగించే సామాగ్రిని ధ్వంసం చేసి,15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్సై రఘునాథరావు తెలిపారు.మల్లిశాల కి చెందిన సీరా నాగేంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతనిపై కేసు నమోదు చేసి కోర్టు లో హాజరుపరుస్తామన్నారు.

## వివాహితపై అత్యాచారం

గూడూరు తిరుపతి జిల్లా గూడూరులో ఒక కామాంధుడు అమానుషానికి ఒడిగట్టాడు. భర్త లేని సమయంలో గిరిజన వివాహితపై అత్యాచారం చేసాడు. భర్త లేని సమయం లో భర్త ఫ్రెండ్ దారుణానికి దిగాడు. బుధవారం వేకువజామున ఇంటిలోకి చొర పడి వివాహితను పక్కనే ఉన్న చెటల్లో కి లాక్కెళ్ళి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కామాంధుడిని బాధితురాలు ప్రతిఘటించడంతో తలపై గట్టిగా కొట్టి తన పిల్లలు చూస్తుండగానే అత్యంత దారుణంగా లైంగిక దాడి జరిపాడు. జరిగిన విషయంపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గతంలో ఓ దివ్యాంగురాలిని అత్యాచారం చేసి.. హత్య చేసిన చోటనే తాజా దుర్ఘటన జరిగింది..

## సిలిండర్ లీక్ పై -విద్యార్థులకు అవగాహన సదస్సు

నంద్యాల నంద్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నాడు అగ్నిమాపక వారోత్సవాలు లో భాగం గా నంద్యాల పట్టణం లోని శ్రీ సంకల్ప్ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్ సేఫ్టీ పై అవగాహన కల్పించారు. స్థానిక అగ్నిమాపక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ యోగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది విద్యార్థులకు అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఇంట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అయ్యి మంటలు వ్యాపించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రమాదం లో గాయపడిన వాళ్ళకు మొదట ఎలాంటి చికిత్స అందించాలా ఆలాగే నీళ్లలో పడ్డ వాళ్ళను ఎలా రక్షించాలో తగు సూచనలు సూచించిన అగ్నిమాపక అధికారులు.

## బ్రిడ్జి మీద వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిగూడెం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం.వార్ఫ్ రోడ్డులో బ్రిడ్జి మీద నుంచి ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తన ఒంటిమీద వేసుకున్న చొక్కాతోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నిత్యం రద్దీగా ఉండే దారిలో కాలువలోకి వేలాడుతూఉన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు గరగపర్రుకు చెందిన మద్ద రమేష్ (35)గా గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

# వెదురు'తో విద్యుత్!

హైదరాబాద్, ఏప్రిల్ 20,అసలే కొన్నేళ్లుగా తీవ్రంగా బొగ్గు కొరత.. ధరలు కూడా చుక్కలను తాకుతూ విద్యుదుత్పత్తి వ్యయం పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గుతోపాటు వెదురునూ కలిపి విద్యుదుత్పత్తి చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు రాష్ట్ర ఉద్యానశాఖ వినూత్న ప్రతిపాదనలను తెర పైకి తెచ్చింది. వెదురును నేరుగా కాకుండా పెల్లెట్ల రూపంలోకి మార్చి వినియోగిస్తారు. ఇప్పటికే చైనా, జర్మనీ, బ్రిటన్, అమెరికా సహా పలు దేశాల్లో వెదురు, బయోమాస్ పెల్లెట్లను థర్మల్ కేంద్రాల్లో ఇంధనంగా వినియోగిస్తున్నారు. మన దేశంలో తొలిసారిగా మన రాష్ట్రంలోనే దీనిని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తొలి రెండేళ్లపాటు 5శాతం, ఆ తర్వాత 7 శాతం బయోమాస్ పెల్లెట్లను బొగ్గుతో కలిసి ఇంధనంగా వినియోగించాలని కేంద్రం ఇటీవలే అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో వెదురుతో పెల్లెట్లను రూపొందించి థర్మల్ కేంద్రాల్లో వినియోగించేందుకు ఉద్యానశాఖ రంగం సిద్ధం చేసింది. పైలెట్ ప్రాజెక్టు కింద భైంసా వద్ద 15 ఎకరాల్లో వెదురుసాగును చేపట్టింది. వెదురును పెల్లెట్స్గా మార్చే యంత్రాలనూ సిద్ధం చేసింది. కొంతమేర పెల్లెట్స్ను తయారుచేసి ఎన్టీపీసీకి పరిశీలన నిమిత్తం పంపించింది. మొత్తంగా రాష్ట్రంలో 2.80 లక్షల ఎకరాల్లో వెదురు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో 8,703 మెగావాట్ల ఐదు జెన్కో ప్లాంట్లు, 1,200 మెగావాట్ల సింగరేణి ప్లాంట్, ఎన్టీపీసీకి చెందిన 4,200 మెగావాట్ల ప్లాంట్లు కలిపి మొత్తం 14,102 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి 870 కిలోల బొగ్గును వినియోగిస్తారు. కేంద్రం నిర్దేశించినట్టుగా ఏడు శాతం బయోమాస్ పెల్లెట్లు వినియోగించాలంటే.. రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తికి 67 లక్షల టన్నుల పెల్లెట్లు అవసరమని ఉద్యానశాఖ వర్గాలు తెలిపాయి. ఎకరానికి 30 టన్నుల వెదురు వస్తే.. దాని నుంచి 20 టన్నుల పెల్లెట్స్ వస్తాయని వెల్లడించాయి. రాష్ట్రంలో సాధారణ వెదురు కాకుండా భీమా రకం వెదురుతో పెల్లెట్స్ తయారు చేయాలని నిర్ణయించారు. ఈ రకం వెదురు ఎలాంటి నేలల్లోనైనా, సరిగా నీళ్లు లేకున్నా పెరుగుతుందని.. దానిని రెండేళ్లలోనే నరికి పెల్లెట్స్ తయారు చేయవచ్చని ఉద్యానశాఖ వర్గాలు చెప్తున్నాయి. చేలల్లో, గట్లమీద, బీడు భూముల్లో ఎక్కడైనా వేయొచ్చని అంటున్నాయి. మొదట్లో ఎకరాకు రూ.50 వేలు ఖర్చు చేసి నాటితే.. తర్వాత దాదాపు 50 ఏళ్లపాటు ఏటా ఆదాయం వస్తుందని అంటున్నాయి. వేసిన రెండేళ్ల నుంచే ఏటా ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం సమకూరుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం హరితహారం కింద కోట్ల మొక్కలు నాటుతున్నారని.. ఆ స్థానంలో వెదురు వేస్తే అన్నివిధాలా ఉపయోగమని అంటున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని చెప్తున్నారు.

ప్రస్తుతం ఏడు శాతం పెల్లెట్స్ను బొగ్గుతో కలిపి వినియోగించాలని కేంద్రం ఆదేశించినా.. 2030 నాటికి 20 శాతం కలపాలన్నది లక్ష్యమని అధికారులు చెప్తున్నారు. అంటే భవిష్యత్తులో వీటికి డిమాండ్ మరింతగా పెరుగుతుందని అంటున్నారు. పైగా వెదురు పెల్లెట్స్తో విద్యుత్ ధర కాస్త తగ్గుతుందని, కాలుష్యాన్నీ కొంత నివారించవచ్చని పేర్కొంటున్నారు. వెదురు చెట్లతో సాధారణ చెట్ల కంటే 33 శాతం మేర ఎక్కువ ఆక్సిజన్ వస్తుందని చెప్తున్నారు. వృక్ష, జంతు పదార్థాలనే బయోమాస్గా పరిగణిస్తారు. జంతువుల అవశేషాలు, చెట్లు, మొక్కల భాగాలు, పంట వ్యర్థాలు వంటివాటిని ఒక్కచోట చేర్చి ఎండబెడతారు. వాటన్నిం టిని పొడిచేసి.. మండే రసాయనాలు కలుపుతారు. తర్వాత అత్యంత వేడి, ఒత్తిడిని కలిగించే యంత్రాల సాయంతో స్థూపాకార (చిన్న గొట్టం వంటి) గుళికలుగా రూపొందిస్తారు. వాటినే బయోమాస్ పెల్లెట్స్ అంటారు. రకరకాల వ్యర్థాలతో రూపొందిన బయోమాస్ పెల్లెట్లను వివిధ ఇంధనాలుగా వినియోగించవచ్చు. అయితే రాష్ట్రంలో పూర్తి వెదురుతో పెల్లెట్లను తయారు చేయాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది.

# విజయసాయిరెడ్డిపై వేటు..?

విజయవాడ, ఏప్రిల్ 20, అంతన్నాడు.. ఇంతన్నాడు.. ఉత్తరాంధ్రకు సామంత రాజునన్నాడు.. ఆ మూడు జిల్లాలు తనవే అన్నాడు. తాడేపల్లి ప్యాలెస్ తనకు రాసిచ్చిందని విర్రవీగాడు. పవర్ అంతా తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. బదిలీలు, బెదిరింపులు, కబ్జాలు, కుట్రలు.. ఒక్కటేమిటి మూడేళ్లుగా అక్కడంతా విజయసాయి మయం. కట్ చేస్తే.. తాజాగా విజయసాయి కోరలు పీకేశారు జగన్రెడ్డి. ఆయనను విశాఖ నుంచి తప్పించేశారు. వైవీ సుబ్బారెడ్డికి విశాఖ పార్టీ బాధ్యతలు అప్పగిస్తూ.. విజయసాయికి మరెక్కడా ఇంఛార్జ్గా నియమించకుండా పక్కన పెట్టేసి.. బిగ్ షాక్ ఇచ్చారు జగన్రెడ్డి. అదే సమయంలో.. మంత్రి పెద్దిరెడ్డి, ఆయన తనయుడు ఎంపీ మిథున్ రెడ్డిలకు ఏకంగా 9 జిల్లాల పరిధిలోని 62 నియోజకవర్గాల బాధ్యతలను అప్పగించి వారి ప్రాధాన్యం మరింత పెంచేశారు.విజయసాయిరెడ్డి స్థానంలో వైవీ సుబ్బారెడ్డికి.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకూ పార్టీ, ప్రభుత్వం తరఫున ఆ బాధ్యతలు చూసిన విజయసాయిపై సొంతపార్టీ నేతలే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం.. భారీగా అవినీతి ఆరోపణలు రావడంతో విజయసాయికి చెక్ పెట్టక తప్పలేదంటున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో భూ ఆక్రమణలకు సంబంధించి పలు ఆరోపణలతో పాటు.. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని పార్టీ నేతలు జగన్కు ఫిర్యాదులు చేయడం.. స్వయంగా స్పీకర్ తమ్మినేని సీతారం, మంత్రి బొత్సలకు సైతం సాయిరెడ్డి నుంచి పలుమార్లు అవమానాలు జరగడంతో.. ఆయన ఓవరాక్షన్ మరీ ఎక్కువైందనే విషయాన్ని తాడేపల్లి గుర్తించినట్టుంది. అందుకే, వేటు వేసిందని అంటున్నారు. విశాఖలో ఉంటే చేదాటిపోతున్నారని భావించి.. పార్టీ అనుబంధ విభాగాల బాధ్యతల పేరుతో సాయిరెడ్డిని తాడేపల్లికి రప్పించి.. జగన్ కనుసన్నల్లో ఉండేలా కట్టడి చేశారని అంటున్నారు. ఇక, సజ్జలను మరో విజయసాయిగా చేస్తున్నారు జగన్మోహన్రెడ్డి. ఆయనకు మరింత ప్రాధాన్యం ఇచ్చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల బాధ్యతలతో పాటు.. పార్టీ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులను సమన్వయం చేసే కీలక పవర్స్ అప్పగించారు.వైసీపీలో పదవుల పంపకాల్లో జగన్ మార్క్ చూపించారు. 11మందికి పార్టీ ప్రాంతీయ సమన్వయ బాధ్యతలు అప్పగించగా, 26 జిల్లాలకూ కొత్త అధ్యక్షులను నియమించారు. 11మంది ప్రాంతీయ సమన్వయకర్తల్లో ఆరుగురు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో జగన్రెడ్డి ప్రయారిటీ ఏంటో స్పష్టం అవుతోంది. ఇక, పునర్వ్యవస్థీకరణలో మంత్రి పదవులు కోల్పోయిన బాలినేని శ్రీనివాసరెడ్డి, కొడాలి నాని, అనిల్కుమార్లకు పార్టీ ప్రాంతీయ సమన్వయ బాధ్యతలనిచ్చారు. మిగిలిన 10మందికి వారి జిల్లా పార్టీ అధ్యక్ష పదవులను కట్టబెట్టారు. మంత్రి పదవులు ఆశించి భంగపడిన ఎమ్మెల్యేలు పార్థసారథి, ఉదయభాను, శిల్పా చక్రపాణిరెడ్డిలు ఇప్పటివరకు వారికున్న పార్టీ జిల్లా అధ్యక్ష పదవుల నుంచి సైతం తొలగించడం మరింత అసంత్రుప్తిని రాజేసినట్టైంది.

**ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటి ఎదుట అంగన్ వాడి ఉద్యోగి ఆత్మహత్యయత్నం**

గుంటూరు ఏప్రిల్ 20 నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి ఇంటి ఎదుట అంగన్ వాడి ఉద్యోగి ఆత్మహత్యయత్నం కలకలం రేపింది. రొంపిచర్ల మండలం, విప్పర్లపల్లికి చెందిన అంగన్ వాడి టీచర్ శివ నాగేంద్రం పురుగుల మందు తాగబోయింది. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు శివ నాగేంద్రంను అడ్డుకున్నారు. అధికార పార్టీ నేతల వేదింపులే కారణంగా బాధితురాలు చెబుతోంది. తనను ఉద్యోగం మానేయాలని ఆరు నెలల నుంచి మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయింది. తనకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే వద్ద బోరున విలపించింది. అలాగే బాధితురాలు శివ నాగేంద్రం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## ఖనిజ ఆధారిత ఆదాయాన్ని పెంచాలి

**మంత్రి పెద్దిరెడ్డి**

అమరావతి ప్రభుత్వానికి ఖనిజ ఆధారిత ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్ర గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. ఇప్పటికే గనులశాఖలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు పలు సంస్కరణలను తీసుకువచ్చామన్నారు. మైనింగ్ లీజుల విషయంలో అత్యంత పారదర్శకతను అమలులోకి తీసుకువస్తూ ఈ-ఆక్షన్ విధానంను ప్రవేశపెట్టామని అన్నారు.సచివాలయంలోని మూడోబ్లాక్లో గనులు, అటవీ, పర్యావరణశాఖ అధికారులతో మైనింగ్ లీజులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గనులశాఖ ద్వారా ఈ-ఆక్షన్ లో మైనింగ్ అనుమతులను జారీ చేసే ప్రక్రియను ప్రారంభించామని, దీనివల్ల ఔత్సాహికులు పలువురు మైనింగ్ రంగంలోకి వస్తున్నారని అన్నారు. ఇదే క్రమంలో గతంలో మైనింగ్ లీజులకు దరఖాస్తులు చేసుకుని, పర్యావరణ, అటవీ అనుమతులు లేక మైనింగ్ చేపట్టకుండా ఉన్న లీజులపై కూడా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.పర్యావరణ, అటవీ, గనులశాఖల మధ్య సమన్వయం ఉంటేనే పెండింగ్ లీజుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. గనుల శాఖ నుంచి లీజులు పొందినప్పటికీ అటు పర్యావరణ, అటవీ శాఖల నుంచి అవసరమైన అనుమతులు తెచ్చుకోవడంలో చాలా మంది విఫలమవుతున్నారని, వారికి ఎదురవుతున్న ప్రతిబంధకాలను పరిశీలించాలని కోరారు. పెండింగ్లో ఉన్న లీజుల్లో మైనింగ్ ప్రారంభించినట్లయితే అటు ప్రభుత్వానికి రెవెన్యూ లభిస్తుందని, ఇటు పర్యావరణ శాఖకు కూడా సిఎఫ్ఓ, సిఎఫ్ఇల ద్వారా ఫీజు రూపంలో ఆదాయం లభిస్తుందని సూచించారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

గుంటూరు తాడికొండ నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ వుండవల్లి శ్రీదేవి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నియోజకవర్గంలో 75 మందికి లబ్ధిదారులకు 22 లక్షల 80 వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ వుండవల్లి శ్రీదేవి బుధవారం నాడు పంపిణీ చేశారు. శ్రీదేవి మాట్లాడుతూ పేదలకు అపన్న హస్తం..సీఎం రిలీఫ్ ఫండ్. పలు రకాల రుగ్మతలో బాధపడుతున్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ అపన్న హస్తం లాంటిది.. పేదలకు మేలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

# అత్యల్ప వర్షపాత మండలాలపై పంట దిగుబడులు ఉత్పత్తులు పెంచాలి

నంద్యాల ( విభారె) రైతు భరోసా కేంద్రాలను పటిష్టం చేసి రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని...అత్యల్ప వర్షపాతం ఉన్న మండలాల్లో వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు పంట దిగుబడుల ఉత్పత్తులపై రైతుల్లో సంపూర్ణ అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ సూచించారు. బుధవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని వైఎస్సార్ సెంటినరీ హాల్లో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అత్యల్ప వర్షపాతం మండల పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సంచాలకులు ప్రశాంతి, పాలక మండలి సభ్యులు విజయభాస్కర్ మహానంది వ్యవసాయ కళాశాల పరిశోధకులు ప్రభాకర్ రెడ్డి ఆర్ఎఆర్ఎస్ పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్సీ వెంకటేశ్వర్లు, నంద్యాల, అనంతపురం, కర్నూలు, సత్యసాయి జిల్లాల వ్యవసాయ పరిశోధకులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన నంద్యాల జిల్లా తూర్పు భూభాగాల మండలాల్లో నీటిపారుదల భూములు అధికంగా ఉన్నాయని...దాదాపు 2 లక్షల హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేసుకుంటున్న నేపథ్యంలో పంట దిగుబడుల ఉత్పత్తులపై రైతుల్లో సంపూర్ణ అవగాహన కల్పించాలని వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలను కోరారు. ఖరీఫ్ సీజన్ లో ఏమి చేయాలి....ఎలా చేయాలి అనే దానిపై వ్యవసాయ అధికారులతో పూర్తిస్థాయిలో చర్చించి తీసుకోవాల్సిన అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారానే రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామని రాబోయే రోజుల్లో ఆర్బికే ల ను మరింత పటిష్టం చేసి పంట దిగుబడులపై పొలంబడి శిక్షణా కార్యక్రమాల ద్వారా రైతులను చైతన్యవంతులను చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యల్ప వర్షపాతం ఉన్న మండలాల్లో వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టిసారించి రైతులు అవలంభించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 70 శాతం మంది రైతులు వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న నేపథ్యంలో రైతులకు సపోర్టుగా ఉండి మేలైన పంట దిగుబడి ఉత్పత్తులపై అన్ని రకాల సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. రైతులు వేసుకునే పూర్వ సాంప్రదాయ పంటలలోని ఆధునిక మెళుకువలను రైతులకు వివరించాలని శాస్త్రవేత్తలను సూచించారు. నూతన కలెక్టరేట్ ఏర్పాటుకు భవనాలు సమకూర్చి సహకరించిన వ్యవసాయ పరిశోధనా కేంద్ర ప్రతినిధులకు కలెక్టర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం రైతాంగానికి దిగుబడి అధికంగా వచ్చే మేలు రకపు విత్తనాలను పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి గ్రామ గ్రామాన రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ముంగిటకే అన్ని సేవలు అందిస్తున్నారన్నారు. గత ఏడాది నంద్యాల ప్రాంతంలో వర్షం లేకపోవడంతో దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయి గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారన్నారు. రైతులు విత్తనం వేసిన నాటి నుండి చీడపీడల గురికాకుండా అన్నిరకాల చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ పరిశోధకులను కోరారు. రైతుల తల రాతలను మార్చే శక్తి, దిగుబడులను పెంచే శక్తి వ్యవసాయ పరిశోధకులకే వుందని మండలి చైర్మన్ తెలిపారు. యువ శాస్త్రవేత్తలు గ్రామ గ్రామానికి వెళ్లి రైతులతో మమేకమై ఆధునిక టెక్నాలజీపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. వైరస్ కారణంగా జిల్లాలో సన్నవర్ సాగుచేసే పరిస్థితి లేదన్నారు. చీడపీడలు, నకిలీ ఎరువులు, విత్తనాలు తదితరాలన్నింటిపై సమగ్ర యాజమాన్య చర్యలు రైతుల దగ్గరికి తీసుకెళ్లాలన్నారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సంచాలకులు ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ మాసంలో అత్యల్ప వర్షపాతం మండల పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశం జరిపి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి పరిశోధించి చర్చిస్తామన్నారు. దేశంలోని 64 విశ్వవిద్యాలయాల్లో నంద్యాల వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి 11వ స్థానం లభించిందన్నారు. ఆర్ఎఆర్ఎస్ పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్సీ వెంకటేశ్వర్లు గత సంవత్సరం చేసిన పరిశోధనా ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. అనంతరం వేరుశనగ సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు, ఆముదము, ప్రొద్దుతిరుగుడు కుసుమ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, ఆముదము మెట్ట ప్రాంతానికి అనువైన పంట తదితర కరపత్రాలను విడుదల చేసారు. వేరుశెనగకు ప్రత్యామ్నాయంగా ఆముదపు విత్తనాల సిడిని కలెక్టర్ ఆవిష్కరించారు.

## వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలను సూచించిన జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలాని సామూన్

## మద్యం కేసులో నిందితులకు మూడేళ్ళు జైలు

ఆదోని కర్ణాటక మద్యం తరలింపు కేసులో నిందితులకు మూడేళ్లు జైలు శిక్ష రూ 10 వేలు జరిమానా విధిస్తూ రెండో జె ఎఫ్ సీఎం వీర వెంకట నాగలక్ష్మి తీర్మానించారు కోసిగి మండలం కోల్మన్ పేట గ్రామానికి చెందిన రామయ్య కడి దొడ్డి గ్రామానికి చెందిన బండిప్ప 2017

డిసెంబర్ 28వ తేదీన కర్ణాటక మద్యాన్ని టీవీ ఎస్ ఎక్సెల్ పై తరలిస్తుండగా కడి దొడ్డి వల్లూరు గ్రామాల మధ్యన కోసిగి ఎక్సైజ్ సి ఐ లక్ష్మీదేవి వారిని అరెస్టు చేశారు వాళ్ల దగ్గర ఉన్న 380 కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు మంగళవారం ఇరువురి పై రుజువు కావడంతో కోర్టు తీర్పు ప్రకటించింది మూడేళ్ల సాధారణ జైలు శిక్ష తో పాటు రూ 10 వేలు జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు శిక్ష అనుభవించాలని మెజిస్ట్రేట్ వీర వెంకట నాగలక్ష్మి తెలిపారు

# బద్వేల్ పట్టణంలో ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేయాలి

## ఏఐఎస్ఎఫ్ నేతల డిమాండ్




బద్వేలు( విభారె) , స్థానిక సిపిఐ కార్యాలయం జె.వి భవన్ నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో (ఏఐఎస్ఎఫ్) బద్వేల్ ఏరియా కార్యదర్శి ఎం.అశోక్ మాట్లాడుతూ..!కడప జిల్లాలో అభివృద్ధి లేని నియోజకవర్గం ఏదైనా ఉంది అంటే అది బద్వేల్ నియోజకవర్గమే.. ఎందుకంటే ఈ నియోజక వర్గంలో ఉన్నటువంటి విద్యార్థులకు ఉచిత విద్య అందక పోవడమే అన్నారు. ఈ నియోజకవర్గంలో ప్రతి ఏటా ఐదు వేల నుండి ఏడు వేల మంది? విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసుకొని బయటకు వస్తున్నారు. కానీ ఈ నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో ప్రైవేటు కళాశాలలకు అధిక ఫీజులు చెల్లించలేక విద్యార్థులందరూ గృహాలకు పరిమితమవుతూ వారు చదివిన చదువు అంతా? బూడిదలో పోసిన పన్నీరు లా అయిపోతుంది అన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో ప్రైవేటు కళాశాల ఫీజులు నిప్పుల్లా చెలరేగుతున్నాయి అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవిత ఆశలపై మట్టి కొడుతున్నారని వారి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత విద్యార్థుల చదువులు పదో తరగతి కే పరిమితమైన...? ఉన్నత చదువులు చదవలేరా... అంటూ వారు ఘాటుగా ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న సంక్షేమ పథకాల కొరత ఏర్పడడంతో పేద బడుగు వర్గాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా అయిందన్నారు. అధికార పార్టీ హామీల భాగంలో ఉన్న అమ్మ ఒడి పథకంపై కూడా? అనేక షరతులు విధించి విద్యార్థులు తమ జీవిత ఆశయాలను మరిచిపోయే విధంగా చేసిందన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామని చెప్పినా రాజకీయ నాయకులే ప్రైవేటు విద్యాసంస్థల అధిక సంఖ్యలో నడుపుతూ ఉచిత విద్య అన్నమాట విద్యార్థులు మరిచిపోవాలి అన్న విధంగా వ్యవహరిస్తున్న తీరును (ఏఐఎస్ఎఫ్) తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంత విద్యార్థులకు ఉచిత విద్య అందక నిరక్షరాస్యత అధికంగా పెరిగే అవకాశముందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ గా ఉన్నటువంటి ఈ నియోజకవర్గంలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందక పోవడం చాలా బాధాకరమన్నారు. ఈ ప్రాంత రాజకీయ నాయకులకు విద్యార్థుల అమూల్యమైన భవిష్యత్తును అందించాలని ఆలోచన ఉన్నా..! ఈ ప్రాంత అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా?..! ఈ వేసవి సెలవులల్లో ప్రభుత్వ కళాశాల పనులను ప్రారంభించాలి వచ్చే నూతన విద్యా సంవత్సరం కల్లా ప్రభుత్వ కళాశాల ను ఏర్పాటు చేయాలిని (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ నాయకులు మల్లీ, ఆది, నవీన్, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి మాజీ ముఖ్యమంత్రి పుట్టిన రోజు వేడుకలు

నంద్యాల :- నంద్యాల జిల్లా కేంద్రంలో బుధవారం నాడు నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమ బ్రహ్మానందరెడ్డి ఇంటి లో తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు 72 వ సంవత్సరం పుట్టిన రోజు వేడుకలను తెలుగు దేశం పార్టీ కౌన్సిలర్లు మాజి కౌన్సిలర్లు 72 వ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు . తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవి సుబ్బారెడ్డి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు 72 వ సంవత్సర పుట్టిన రోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అలాగే గవర్నమెంట్ ఆసుపత్రి యందు రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్తదానం చేసిన ప్రతి కార్యకర్తను అభినందించారు. నంద్యాల తెలుగుదేశం పార్టీ మైనారిటీ కార్యదర్శి యస్ ఎ బాబుల్లాను ప్రత్యేకంగా ఎవి సుబ్బారెడ్డి అభినందించారు. నంద్యాల లో అందరు కలిసి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారని ఎంతో ఆశతో తెలుగుదేశం పార్టీ అభిమానులు ఉంటే నాయకులు మాత్రం ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారని అభిమానులు నిరుస్తాహ పడ్డారు .

## గాయపడిన మహిళ మృతి

ఆళ్లగడ్డ ఆళ్లగడ్డ మండలంలోనిగూ బగుండం మెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న నాగమణి 24 మంగళవారం మృతి చెందింది దీంతో ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి సంఖ్య నాలుగుకు చేరింది మైదుకూరు కు చెందిన చీమకుర్తి వెంకటేశ్వర్లు తన కుటుంబ సభ్యులతో కలసి బేతంచెర్ల మండలం మద్దిలేటి స్వామి ని ఈనెల 17వ తేదీ దర్శించుకుని స్వగ్రామానికి వెళుతుండగ గుబగుండం మెట్ట వద్ద ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో వంతెనను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది వెంకటేశ్వర్లు అతని భార్య విజయలక్ష్మి అక్క అక్కడికక్కడే మృతి చెందారు ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు కూతురు నాగలక్ష్మి మనుమరాలు మౌనిక డ్రైవర్ శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ నాగలక్ష్మి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ నరసింహుడు తెలిపారు

# మెగాస్టార్ రిజెక్ట్ చేసిన స్టోరీతో హిట్ కొడతాడా..??


ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ నాన్ స్టాప్ గా సినిమాలు చేస్తున్నాడు మాస్ మహారాజా రవితేజ. అందులో "టైగర్ నాగేశ్వరరావు" మూవీ ఒకటి. ఇది రవితేజకు ఫస్ట్ పాన్ ఇండియా మూవీ. వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూవర్ట్ పురంలో పేరుమోసిన గజదొంగ.. పోలీసుల్ని ముప్పుతిప్పలు పెట్టిన నాగేశ్వరరావు జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. అయితే ఈ టైగర్ నాగేశ్వరరావు స్టోరీ రవితేజ కంటే ముందు చాలామంది హీరోల చేతులు మారిందని తెలుస్తోంది. దర్శకుడు వంశీ ఈ స్క్రిప్ట్ ను గతేడాది కరోనా పాండమిక్ టైంలో మెగాస్టార్ చిరంజీవి కి వినిపించారు. ఈ విషయాన్ని చిరు స్వయంగా వెల్లడించారు. ఈ కథను వంశీ తనకు వినిపించాడని.. చాలా బాగా నచ్చిందని అన్నారు. ఇందులో అన్ని రకాల కమర్షియల్ ఎలిమెంట్స్ తో



పాటుగా మంచి క్యారెక్టరైజేషన్ ఉందని.. కానీ ఏదో కుదరక తాను చేయలేదని.. ఇది రవితేజకు సరిగ్గా సరిపోతుందని చిరంజీవి తెలిపారు. అయితే మెగాస్టార్ తన ఇమేజ్ కి ఈ స్టోరీ సూట్ కాదనే రిజెక్ట్ చేశాడని టాక్ ఉంది. అంతేకాదు ఆ తర్వాత ఆ కథ చాలా మంది హీరోల వద్దకు వెళ్లి చివరకు రవితేజ ఓకే చెప్పడంతో సెట్స్ పైకి వెళ్లిందని అంటున్నారు. ఏదైతేనేం చిరంజీవి తిరస్కరించిన స్క్రిప్ట్ తోనే ఇప్పుడు రవితేజ 'టైగర్ నాగేశ్వరరావు' సినిమా చేస్తున్నారు. ఎవరో చేయాల్సిన సినిమా మరెవరో చేసి సక్సెస్ అందుకున్న సందర్భాలు గతంలో చాలానే ఉన్నాయి. అంతెందుకు రవితేజ కూడా వేరే హీరోతో అనుకున్న స్క్రిప్ట్ తో హిట్స్ అందుకున్నారు. ఇప్పుడు చిరు రిజెక్ట్ చేసిన కథతో ఎలాంటి విజయాన్ని అందుకుంటారో చూడాలి. ఇకపోతే ఇటీవల చిరు సమక్షంలోనే 'టైగర్..' మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ ఖర్చుతో నిర్మించిన ఓ సెట్ లో షూటింగ్ జరుగుతుందని సమాచారం. దీని కోసం దాదాపు 7 కోట్లు ఖర్చు చేసారట. ఈ సినిమాకు మాస్ రాజా రెమ్యునరేషన్ కూడా పెంచినట్లు ప్రచారం జరుగుతోంది. 'ఖిలాడీ' తర్వాత ఇది రవితేజ కెరీర్ లోనే అత్యధిక బడ్జెట్ తో రూపొందే సినిమా. ఇందులో రవితేజ సరసన బాలీవుడ్ భామలు నుపూర్ సనన్ – గాయత్రి భరధ్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రేణు దేశాయ్ కీలక పాత్రలో కనిపించబోతోంది. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ పై నిర్మాత అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికిసంగీతం సమకూరుస్తున్నారు. మధే సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. తెలుగు హిందీ తమిళ కన్నడ మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. 'ఖిలాడి' చిత్రంతో భారీ ఫ్లాప్ అందుకున్న రవితేజ.. "టైగర్ నాగేశ్వరరావు" సినిమాతో మళ్లీ సక్సెస్ ట్రాక్ ఎక్కాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# 'కళావతి' స్టెప్స్ తో మహేశ్ దుమ్మురేపేశారు: శేఖర్ మాస్టర్


నిన్నమొన్నటి వరకూ టాలీవుడ్ స్టార్ హీరోలకు డాన్స్ కంపోజ్ చేయాలంటే కోలీవుడ్ నుంచి డాన్స్ మాస్టర్లు రావలసిందే. సుందరం మాస్టర్ .. ప్రభుదేవా .. లారెన్స్ .. ఇలా అక్కడివారి హవానే ఇక్కడ కొనసాగింది. అయితే పాటల ప్రోగ్రామ్స్ ద్వారా ఇండస్ట్రీకి చాలామంది సింగర్స్ పరిచయమైనట్టుగానే డాన్స్ షోల వలన చాలామంది డాన్స్ మాస్టర్లు వెలుగులోకి వచ్చారు. అంతేకాదు తమిళ స్టార్ హీరోలు ఇక్కడి డాన్స్ మాస్టర్లను అక్కడికి పిలిపించుకునేలా చేశారు.



అలాంటి డాన్స్ మాస్టర్లలో శేఖర్ మాస్టర్ పేరు ఎక్కువగా వినిపిస్తోంది. శేఖర్ మాస్టర్ కి టాలెంట్ ఉంది .. దానిని రాణింపుకు తీసుకుని వచ్చే వినయవిధేయతలు ఉన్నాయి. మేకర్స్ తో పాటు హీరోలతోను మంచి పరిచయాలు ఉన్నాయి. తమకి ఫలానా సాంగ్ శేఖర్ మాస్టర్ చేసి పెట్టాలని కోరే హీరోలు ఉన్నారు. ఆయన పేరును సిఫార్స్ చేసే హీరోలు ఉన్నారు. ఇక హీరోల బాడీ లాంగ్వేజ్ ను దృష్టిలో పెట్టుకుని డాన్సులు కంపోజ్ చేయడంలో శేఖర్ మాస్టర్ సిద్ధహస్తుడు. తనకి వచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుని ఆ పాటపై తనదైన ముద్ర వేయడానికి ఆయన ఎంతగానో కష్టపడతాడు. ఇటీవల 'సర్కారువారి పాట' నుంచి వచ్చిన ' కళావతి' సాంగ్ వ్యూస్ పరంగా .. లైక్స్ పరంగా కొత్త రికార్డులను కొల్లగొట్టిన సంగతి తెలిసిందే. ఈ పాటలోని సిగ్నేచర్ స్టెప్ ను ఎంతమంది ఏ స్థాయిలో రీల్స్ చేశారనేది ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఎక్కడ చూసినా ఇప్పుడు ఈ పాటనే మ్రోగుతోంది. తాజా ఇంటర్వ్యూలో ఈ పాటకి తాను కంపోజ్ చేసిన సాంగ్ ను గురించి శేఖర్ మాస్టర్ ప్రస్తావించాడు. "మహేశ్ బాబుకి నేను చేసిన ఫస్టు సాంగ్ 'సరిలేరు నీకెవ్వరు'లోని మైండ్ బ్లాక్ సాంగ్. ఆ తరువాత మహేశ్ బాబు చేసిన సినిమా 'సర్కారువారి పాట'నే. ఈ సినిమాలో కూడా మహేశ్ నాకు ఒక ఛాన్స్ ఇవ్వొచ్చని అనుకున్నాను. అనుకున్నట్టే ఆయన ' కళావతి' సాంగ్ ఇచ్చారు. మహేశ్ బాబుగారితో స్టైలిష్ గా .. క్యూట్ గా .. అందంగా చేయించాలనే సెన్స్ తో ఆ డాన్స్ ను కంపోజ్ చేయడం జరిగింది. మహేశ్ బాబుగారు చాలా అందంగా చేయడంతో ఈ సాంగ్ ఎక్కడికో వెళ్లిపోయింది. 'పెన్నీ' సాంగ్ కూడా నేనే చేశాను .. మరో సాంగ్ చేయబోతున్నాను" అని చెప్పుకొచ్చాడు. 'పెన్నీ' సాంగ్ కూడా బాగా పాప్యులర్ అయిన సంగతి తెలిసిందే. ఇక మరో సాంగ్ ఏ స్థాయి సంచలనానికి తెరతీస్తుందో చూడాలి.

# 'హలో బ్రదర్'లో నాగ్ కి డూప్ గా చేసింది ఈ స్టార్ హీరోనే!

నాగార్జున కెరియర్లో చెప్పుకోదగిన సినిమాలలో 'హలో బ్రదర్' ఒకటిగా కనిపిస్తుంది. నాగార్జున ఫస్టు టైమ్ ద్విపాత్రాభినయం చేసిన సినిమా ఇది. అలాగే




నాగార్జునను మాస్ ఆడియన్స్ కి మరింత చేరువ చేసిన సినిమా ఇది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై కేఎల్ నారాయణ నిర్మాణంలో ఈవీవీ సత్యనారాయణ ఈ సినిమాను రూపొందించారు. 1994లో విడుదలైన ఈ సినిమా ఆడియన్స్ ను ఒక ఊపు ఊపేసింది. ఈవీవీ కథాకథనాలు .. పాత్రలను మలచిన తీరు ఈ సినిమా విజయంలో ప్రధానమైన పాత్రను పోషించాయి. లవ్ .. యాక్షన్ .. ఎమోషన్ .. సెంటిమెంట్ .. రొమాన్స్ .. కామెడీ .. ఇలా అన్ని అంశాలను ఈవీవీ సమపాళ్లలో రంగరించి అందించిన కథ ఇది. ముఖ్యంగా నాగార్జున పోషించిన రెండు పాత్రలను ఆయన డిజైన్ చేసిన తీరు అద్భుతం. రెండు పాత్రల మధ్య వైవిధ్యాన్ని ఆయన ఒక రేంజ్ లో ఆవిష్కరించారు. ఈ కథలో అన్ని రసాలను తగినట్టుగా సర్దుతూ వెళ్లడం వలన చివరివరకూ కథనంలో పట్టు తగ్గకుండా నడిపించడం వలన ఎక్కడా బోర్ కొట్టదు. ఇప్పటికీ సినిమాను చూస్తూ ఎంజాయ్ చేయడానికి కారణం ఈవీవీ గొప్పతనమే. ఇక నాగ్ సరసన రమ్యకృష్ణ .. మరో నాగ్ జోడీగా సౌందర్య సందడి చేసిన ఈ సినిమాను ప్రేక్షకులు ఇప్పటికీ మరిచిపోలేదు. ఈ సినిమాలో నాగార్జునలు ఇద్దరూ ఒకే ఫ్రేమ్ లో కనిపించవలసి వచ్చినప్పుడు నాగార్జునకి మరో హీరో డూప్ గా చేశాడు. నాగార్జున చెప్పేవరకూ ఈ విషయం బయటి ప్రేక్షకులలో ఎవరికీ తెలియదు. ఇంతకీ నాగార్జునకి డూప్ గా చేసిన ఆ హీరో ఎవరో కాదు .. శ్రీకాంత్. ఆయనకి ఈవీవీతో మంచి సాన్నిహిత్యం ఉంది. నాగార్జున హైటుకి .. పర్సనాలిటీకి దగ్గరగా శ్రీకాంత్ ఉండటంతో ఆయనకి ఈవీవీ ఈ ఛాన్స్ ఇచ్చారట. ఆ మధ్య ఒక సందర్భంలో నాగ్ ఈ విషయాన్ని చెప్పారు. అప్పుడు అంతా ఆశ్చర్యపోయారు. ఆ తరువాత కూడా నాగార్జున 'సోగ్గాడే చిన్నినాయనా' వంటి సినిమాల్లో ద్విపాత్రాభినయం చేసినప్పటికీ ' హలో బ్రదర్' స్థాయిలో ఏదీ అలరించలేకపోయింది .. ఆకట్టుకోలేకపోయింది. నాగ్ డ్యూయెల్ రోల్ మూవీ అనగానే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది ఈ సినిమానే. అంతగా ఈ సినిమా ప్రేక్షకులను ప్రభావితం చేసింది. ఆ తరువాత కూడా శ్రీకాంత్ అటు నాగార్జున .. ఇటు ఈవీవీ సినిమాలలోను నటించాడు. ఇక ఈ సినిమా ఇప్పటికీ గుర్తుండిపోవడానికి మరో కారణం రాజ్ – కోటి అందించిన బాణీలని చెప్పుకోవచ్చు.

# 'కోహ్లి స్లెడ్జింగ్ వేరే లెవెల్.. తలదించుకొనే బ్యాటింగ్ కొనసాగించా'



ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాట్స్‌మన్ సూర్యకుమార్ యాదవ్ టీమిండియా మెషిన్ గన్ విరాట్ కోహ్లిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కోహ్లి స్లెడ్జింగ్ వేరే లెవెల్లో ఉంటుందని.. మనం తట్టుకోవడం కష్టమంటూ పేర్కొన్నాడు. గౌరవ్ కపూర్ నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ విత్ చాంపియన్స్ యూట్యూబ్ షోలో సూర్యకుమార్ ఈ వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్ 2020 సీజన్‌లో ముంబై ఇండియన్స్, ఆర్సీబీ మధ్య కీలకమైన ప్లేఆఫ్ మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో కోహ్లితో జరిగిన అనుభవాన్ని సూర్య ఆసక్తికరంగా చెప్పుకొచ్చాడు."165 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగాం. అయితే రెండు వికెట్లు కోల్పోవడంతో మా చేజింగ్ కాస్త స్లోగా సాగుతుంది. ఎలాగైనా మ్యాచ్ గెలవాలనే పట్టుదలతో ఎవరు ఏం చేసినా నా బ్యాటింగ్ ఫోకస్‌ను కోల్పోకూడదని భావించాను. కానీ అప్పటి ఆర్‌సీబీ కెప్టెన్ కోహ్లి రూపంలో నాకు ఎదురుగా కనిపించాడు. గ్రౌండ్‌లో ఉంటే కోహ్లి ఎనర్జీ లెవెల్స్ వేరుగా ఉంటాయి. అతను పొరపాటు స్లెడ్జింగ్‌కు దిగాడో తట్టుకోవడం కష్టం. ఒక రకంగా కోహ్లికి ఎనర్జీ లాంటిది. తన చర్యలతో ప్రత్యర్థి జట్ల బ్యాట్స్‌మెన్లను కన్ఫూజ్ చేస్తాడు. అతని మాయలో పడకూడదని గట్టిగా ఫిక్స్ అయ్యా. పైగా ఇరుజట్లకు అది కీలక మ్యాచ్. ఓడిన జట్టు ఇంటికి.. గెలిచిన జట్టు ఫైనల్‌కు. ఈ పరిస్థితుల్లో కోహ్లి కళ్లలో పడకూడదనే ఉద్దేశంతో బ్యాటింగ్ కొనసాగించా. కోహ్లి నాకు ఎదురుగా ఉన్నప్పుడు తలదించుకొని బ్యాటింగ్ చేశా. దీనివల్ల నా ఫోకస్ దెబ్బతినలేదు. నేను బ్యాటింగ్ చేస్తున్నంత సేపు కోహ్లిని నేను ఏమి అనలేదు.. నన్ను కోహ్లి ఎలాంటి స్లెడ్జ్ చేయలేదు. మ్యాచ్ విజయానికి చేరువవుతున్న తరుణంలో మనుసులో ఈ విధంగా అనుకున్నా." ఇంతవరకు అంతా సక్రమంగానే జరిగింది. ఇంకో 10 సెకన్లు ఓపిక పడితే మ్యాచ్ గెలుస్తాం.. ఈ సమయంలో ఎలాంటి పొరపాట్లు చేయకూడదు"..ఇక కోహ్లి ఒక సందర్భంలో నా దగ్గరికి వచ్చాడు. కానీ అదే సమయంలో నా బ్యాట్ కిందపడిపోవడంతో ఏం మాట్లాడకుండా బ్యాట్ తీసుకోవడానికి కిందకు వంగాను. కోహ్లి నవ్వుతూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత మేము మ్యాచ్ గెలవడం.. ఆపై టైటిల్ గెలవడం జరిగిపోయింది" అంటూ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2020 సీజన్‌లో ముంబై ఇండియన్స్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఫైనల్లో ముంబై ఇండియన్స్ ఐదు వికెట్ల తేడాతో నెగ్గి ఐదోసారి ఐపీఎల్ టైటిల్ ఎగురేసుకపోయింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190